గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 230, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, శనివారం - 28 - సెప్టెంబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## 'ఇకపై లా కోర్సులు చదవాలంటే క్రిమినల్ బ్యాగ్‌గ్రౌండ్ తనిఖీ తప్పనిసరి..'




2

ఈ మేరకు దేశంలో న్యాయవిద్య అందించే విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ఆదేశాలు జారీచేసింది

తరగతి గదులు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

## తిరుమల లడ్డూ వివాదం వేళ ప్రయాగ్ రాజ్‌లోని ఆలయాలు అనూహ్య నిర్ణయం

అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని నిర్ధారణ కావడంతో హిందూ సమాజం, ధార్మిక సంస్థలు తీవ్ర ఆగ్ర హాన్ని వ్యక్తం చేస్తున్నాయి.



2

## అమెరికాలో ఆలయ గోడలపై విద్వేష రాతలు



2

హిందువులు తిరిగి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు

మోదీ హిట్లర్, టెర్రరిస్ట్ అంటూ గోడలపై రాసిన దుండగులు

ఆందోళనల్లో ఇండియన్ అమెరికన్లు.. దర్యాప్తు జరుపుతున్న పోలీసులు

గడిచిన పది రోజుల్లో ఇది రెండో ఘటన

ఢిల్లీ: అమెరికాలోని ఆలయ గోడలపై హిందూ విద్వేష రాతలు దర్శనమిచ్చాయి.. కాలిఫోర్నియాలోని స్వామినారాయణ్ మందిర్ వద్ద మిగతా..2లో

## బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లు వాడితే.. ఆ దేశాలపై అణుదాడి చేస్తాం..



2

మాస్కో: అణ్వాయుధాల వాడకం విషయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొత్త సిద్ధాంతాన్ని ప్రకటించారు. ఏ సమయంలో ఎప్పుడు, ఎందుకు అణ్వాయుధం వాడతామో ఆయన స్పష్టం చేశారు. మిగతా..2లో

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...

## దసరా నాటికి కమిటీల ఏర్పాటు..!

- నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని సీఎం
- అర్హులైనవారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి
- పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం అధికారులను దిశానిర్ధేశం

హైదరాబాద్ : ఇళ్లు లేనివారికి రేవంత్ రెడ్డి సర్కార్ మరో నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలాగే నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ





సందర్భంగా.. దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు

2లో

# పవన్ దీక్షా దక్షతలను ఎందుకు ప్రశ్నిస్తున్నారు



- **పవన్ మార్క్ పాలిటిక్స్ ఆ విధంగానే హైలెట్ అవుతూ వచ్చింది**
- **తిరుపతి లడ్డూ అపవిత్రం అయింది అని పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష**
- **టీడీపీ కూటమి ప్రభుత్వానికి బాసటగా నిలిచి ఉప ముఖ్యమంత్రిగా కొలువు తీరారు**
- **ప్రాయశ్చిత్త దీక్ష సాధారణంగా ఎవరు చేసుకుంటారు అంటే తప్పు చేసిన వారు**
- తన హక్కులను బాధ్యతలను పూర్తి స్థాయిలో డిశ్చార్జి చేస్తేనే సమస్యలకు పరిష్కారం

2లో


అమరావతి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురించి ఆయన రాజకీయం గురించి తెలియని వారు లేరు. ఆయన గత పదేళ్ళుగా రాజకీయాల్లో చురుకుగా ఉంటూ వస్తున్నారు. ఆయన దూకుడుతో కూడిన రాజకీయం చేస్తారు. అగ్రెస్సివ్ మోడ్ లో మాట్లాడుతారు. ఆయన ప్రసంగాలు ఆవేశ పూరితంగా ఉంటాయి. ఇవన్నీ అందరికీ తెలిసిందే. అత్యధికులు వాటిని ఎంజాయ్ చేస్తూ ఉంటారు. పవన్ మార్క్ పాలిటిక్స్ ఆ విధంగానే హైలెట్ అవుతూ వచ్చింది. అయితే పవన్ పదేళ్ళ పాటు సుదీర్ఘమైన పోరాటం చేసిన తరువాత అధికారం అందుకున్నారు. ఆయన టీడీపీ కూటమి ప్రభుత్వానికి బాసటగా నిలిచి ఉప ముఖ్యమంత్రిగా కొలువు తీరారు. అధికారంలో ఉంటూ దాదాపుగా నాలుగు నెలల పాలన పూర్తి చేశారు. అయితే పవన్ కళ్యాణ్ గతంలో చేసిన దూకుడు రాజకీయం ఇపుడు మాత్రమే ప్రశ్నించబడుతోంది.

## 3 పార్టీల పోటాపోటీ.. 40 మంది ఎమ్మెల్యేలు..

# తెలంగాణలో మరో ఎన్నిక..

- టికెట్ కోసం పార్టీల్లోనే నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది
- ఇదంతా కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ సెగ్మెంట్ గురించి
- నాలుగు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంకా నోటిఫికేషన్ కూడా రాలేదు
- సంబంధం లేనివారూ రంగంలోకి దిగనుండడంతో ఎమ్మెల్సీ ఎన్నిక పార్టీలు-సామాన్యులు అన్నట్లుగా మారింది

## మరికొన్ని రోజుల్లో జరగనున్న ఎన్నిక ఆసక్తి రేపుతోంది




హైదరాబాద్: గత ఏడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు.. ఆపై మే నెలలో లోక్ సభ ఎన్నికలు.. ఓ ఎమ్మెల్సీ, అసెంబ్లీ ఉప ఎన్నికలు.. ఇలా దాదాపు సుదీర్ఘ సమయం ఎన్నికల కోలాహలం నెలకొంది తెలంగాణ. ఇంకా స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే, వీటి మధ్యనే మరో ఎన్నిక కూడా వస్తోంది. అక్కడ పోటీ తీవ్రంగా ఉంది. కారణం.. గత ఏడాది అధికారం చేతులు మారడం. అధికారంలోకి వచ్చిన

## మీడియా ప్రతినిధులపై కర్ణాటక సీఎం అసహనం



- ముడా స్కాంలో సిద్ధరామయ్యపై ఆరోపణలు
- సీఎంను విచారించేందుకు గవర్నర్ అనుమతి
- గవర్నర్ అనుమతివ్వడం చట్టబద్ధమేనన్న హైకోర్టు
- సిద్దూ రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ డిమాండ్

ఢిల్లీ :కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీడియాపై సహనం కోల్పోయారు.

## జగన్ క్రిస్టియన్.. తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే: రఘురామకృష్ణరాజు



2లో

- తిరుమలలో అన్యమతస్తులు రూల్స్ పాటించాల్సిందేనన్న రఘురాజు
- శ్రీవారి పట్ల విశ్వాసం ఉందని జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని వ్యాఖ్య
- పాప పరిహారం కోసం జగన్‌ను స్వామివారు తిరుమలకు పిలిచారన్న రఘురాజు

అమరావతి : వైసీపీ అధినేత జగన్ ఈ నెల 28న తిరుమలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. 28న ఆయన అలిపిరి నడక దారిలో మిగతా..2లో



## హైడ్రా బాధితులకు అండగా ఉంటాం...

# అక్కడకు రండి: కేటీఆర్

హైదరాబాద్ : హైడ్రా బాధితులకు తాము అండగా ఉంటామని, ఎవరికైనా ఏమైనా సమస్య వస్తే హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఆఫీస్... తెలంగాణ భవన్‌కు రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా బాధితు లందరికీ తప్పకుండా తమ పార్టీ, తమ పార్టీ



న్యాయ విభాగం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తమ పార్టీ కార్యాలయం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10, రోడ్డు నెంబర్ 12 మధ్యలో ఉంటుందని, బాధితులు అక్కడికి రావొచ్చని సూచించారు. అక్కడ తమ న్యాయవిభాగం సహకారం అంది స్తుందన్నారు. మిగతా..2లో

- హైడ్రా బాధితులకు బీఆర్ఎస్, పార్టీ న్యాయవిభాగం అండగా ఉంటుందన్న కేటీఆర్
- బాధితులు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి రావాలని సూచన
- చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలని న్యాయస్థానం ద్వారానే ప్రభుత్వానికి చెప్పిస్తాం
- లేదంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలవాలన్న కేటీఆర్

2లో

## కొత్త మద్యం షాపులు వారికే, మార్గదర్శకాలు - ఫీజు ఖరారు..!!



బ్రాండెడ్ మద్యం

2లో

- రిజర్వేషన్ల కోటాలోని షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై అబ్కారీ శాఖ కసరత్తు
- ఏపీలో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమవుతోంది
- రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల

అమరావతి: ఏపీలో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ కు రంగం సిద్ధమైంది. మిగతా..2లో

## పదేండ్లు విధ్వంసమైన తెలంగాణ పునర్నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం



- రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి
- మీకు అప్పగించిన పనిని నిబద్ధతతో చేస్తే మన రాష్ట్రం ప్రగతిబాటలో సాగుతుందని ఆశాభావం వ్యక్తం
- రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన సంఘటనలను మనం చూశాం

హైదరాబాద్ : గత ప్రభుత్వంలో విధ్వంసమైన తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషించాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని మిగతా..2లో

# 'ఇకపై లా కోర్సులు చదవాలంటే క్రిమినల్ బ్యాగ్‌గ్రౌండ్ తనిఖీ తప్పనిసరి..'

హైదరాబాద్,: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) తాజాగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. న్యాయవాద వృత్తిలో పారదర్శకత, నైతిక ప్రమాణాలను పెంపొందించాలనే లక్ష్యంతో అనేక కొత్త నియంత్రణ చర్యలను తీసుకొచ్చింది. న్యాయ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో సహా అన్ని లీగల్ ఎడ్యుకేషన్ కేంద్రాలకు వర్తిస్తాయని ప్రకటించింది. న్యాయ విద్య, ఉద్యోగాల్లో చేరే వారికి తప్పనిసరిగా క్రిమినల్ బ్యాగ్ గ్రౌండ్ చెక్ చేయాలని బీసీఐ స్పష్టం చేసింది. న్యాయవిద్య కోర్సుల్లో అభ్యర్థులకు మార్కుల మెమో, పట్టా ఇచ్చేముందు వారి పూర్వాపరాలను పరిశీలించాలని, నేరచరిత్ర ఉంటే తమ అనుమతి పొందిన తర్వాతే పట్టా ఇవ్వాలనే కఠిన నిబంధన విధించింది. ఈ మేరకు దేశంలో న్యాయవిద్య అందించే విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ఆదేశాలు జారీచేసింది. లా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు నేరచరిత్ర ఉండరాదని, అందుకే క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ చెక్‌సిస్టమ్ (సీబీసీఎస్)ను అమలు చేస్తున్నట్లు పేర్కొంది. మార్కుల ధ్రువపత్రాలు, డిగ్రీ పట్టాలు జారీచేసే ముందు విద్యార్థుల నేరచరిత్రను తప్పని సరిగా పరిగణనలోకి తీసుకోవాలని, ప్రస్తుత ఎఫ్ఐఆర్, నేరంపై కేసు, శిక్ష తదితర వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. ఒకవేళ నేరచరిత్ర ఉంటే వివరాలను బీసీఐకి పంపించి, వారి నుంచి అనుమతి వచ్చాకే విద్యార్థులకు పట్టాలు అందించాలని పేర్కొంది. ఆయా నిబంధనలపై విద్యార్థులంతా హామీపత్రం కూడా సమర్పించాలంది. న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించే వ్యక్తులు క్లీన్ క్రిమినల్ రికార్డును కలిగి ఉండేలనే లక్ష్యంతో ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు పేర్కొంది.

బీసీఐ జారీ చేసిన కీలక ఆదేశాలు ఇవే.. :- విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ప్రతి లా కాలేజీ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలి. తరగతి గదులు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. లీగల్ ఎడ్యుకేషన్-2008 నిబంధనల ప్రకారం.. ఎల్ఎల్‌బీలో చేరేముందు విద్యార్థులు తప్పనిసరిగా ఇతర రెగ్యులర్ కోర్సులు చదవడం లేదని హామీపత్రం ఇవ్వాలి. ఈ నిబంధన ప్రకారం ఏకకాలంలో మరొక డిగ్రీని అభ్యసించడం నేరం. అంతేకాకుండా విద్యార్థులు అభ్యసిస్తున్న ఎల్ఎల్‌బి కోర్సుపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించడానికి దోహదపడుతుంది. ఒకవేళ ఎవరైనా ఏక కాలంలో మరో కోర్సు చదువుతున్నట్లు తేలితే వారి డిగ్రీ రద్దు అవుతుంది. తమ యాజమాన్యాల నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసీ) ఇస్తే మినహా.. ఎల్ఎల్‌బీ విద్యార్థులు తాము ప్రస్తుతం ఉద్యోగం చేయడం లేదని వెల్లడించాలి. అలాగే ఎల్ఎల్‌బీ విద్యార్థులు తమ ఉద్యోగ స్థితిని కూడా తెలియజేయాలి. %యాదీ% ప్రోగ్రామ్‌లో ఎటువంటి హోదాలో ఉద్యోగం చేయకూడదు.

# తిరుమల లడ్డూ వివాదం వేళ ప్రయాగ్ రాజ్‌లోని ఆలయాలు అనూహ్య నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ఈ వ్యవహారం నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న ఆలయాల పాలకులు కీలకమైన ప్రకటన చేశారు. ప్రసాదంగా స్వీట్లు, ప్రాసెస్ చేసిన ఇతర ఆహార పదార్థాలను భక్తులు తీసుకురావొద్దంటూ నిషేధం విధించారు. స్వీట్లకు బదులుగా కొబ్బరికాయలు, పండ్లు సమర్పించాలని సూచించారు. ఈ ఆంక్షలు విధించిన ఆలయాల జాబితాలో ఆలోప్ శంకరీ దేవి, బడే హనుమాన్, మంకమేశ్వర్‌తో పాటు నగరంలోని అనేక ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి.

పూజారులు ఏమన్నారంటే..

భక్తులు స్వీట్లు సమర్పించకుండా విధించిన నిషేధంపై ప్రయాగ్‌రాజ్‌లోని ప్రఖ్యాత లలితా దేవి ఆలయ ప్రధాన అర్చకుడు శివ్ మురత్ మిశ్రా మాట్లాడారు. మంగళవారం జరిగిన ఆలయ నిర్వాహకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారికి స్వీట్లను ప్రసాదంగా ఇవ్వకూడదని నిర్ణయించామని, అయితే భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, యాలకులు వంటి వాటిని సమర్పించవచ్చునని సూచించారు. ఇక భక్తులకు స్వచ్ఛమైన స్వీట్లు అందుబాటులో ఉండేలా ఆలయ ప్రాంగణంలో దుకాణాలను తెరిచే యోచన చేస్తున్నట్టు వివరించారు. తిరుపతి వివాదం నేపథ్యంలో మంకమేశ్వరాలయానికి బయట నుంచి భక్తులు తీసుకొచ్చే మిఠాయి ప్రసాదాలపై నిషేధం విధించాలని నిర్ణయించినట్టు ఆలోప్ శాంకరీ దేవి ఆలయ ప్రధాన పోషకుడు, శ్రీ పంచాయతీ అఖారా మహానిర్వాణి కార్యదర్శి యమునా పురి మహారాజ్ తెలిపారు. ఇక ఆలయంలో వెలుపల దుకాణాల్లో లభించే లడ్డూను పరీక్షించాలంటూ జిల్లా మేజిస్ట్రేట్‌కు లేఖ రాసినట్టు వివరించారు.

# అమెరికాలో ఆలయ గోడలపై విద్వేష రాతలు

మొదటి పేజి తరువాయి

ఈ ఘటన చోటుచేసుకుంది. ఆలయ గోడలను పాక్షికంగా ధ్వంసం చేసిన దుండగులు.. హిందువులంతా వెనక్కి వెళ్లిపోవాలంటూ గోడపై పెయింట్ తో రాశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ లు టెర్రరిస్టులని, మోదీ హిట్లర్ అని గోడలపై రాశారు. ఈ ఘటనతో శాక్రిమెంటోలోని హిందువులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. హిందూ విద్వేష రాతలపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శాక్రిమెంటో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశోధన చేపట్టారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. గడిచిన పది రోజులలో ఈ తరహా ఘటన చోటుచేసుకోవడం ఇది రెండవ సారి కావడం గమనార్హం. ఇటీవల న్యూయార్క్ లోని స్వామినారాయణ్ మందిర్ వద్ద కూడా దుండగులు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు. కాగా, ఈ విద్వేష రాతలకు సంబంధించిన ఫొటోలను స్వామి నారాయణ్ మందిర్ అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ.. మహంత్ స్వామి మహారాజ్ బోధనలు గుర్తుచేసుకుంటూ విద్వేషాన్ని తరిమికొట్టేందుకు, ఐకమత్యాన్ని చాటిచెప్పేందుకు మరింత నిబద్ధతతో ప్రచారం సాగిస్తామని తెలిపింది. ఈ ఘటనను మందిర్ కమ్యూనిటీ మొత్తం తీవ్రంగా ఖండించినట్లు పేర్కొంది. మరోవైపు, ఈ ఘటనపై భారత సంతతికి చెందిన చట్ట సభ్యుడు అమి బెరా స్పందించారు. విద్వేష రాతలను ఆయన ఖండించారు. శాక్రిమెంటో కౌంటీలో జాతి, మతం సహా ఎలాంటి విద్వేషాలకు తావులేదని తేల్చిచెప్పారు. మతం ఏదైనా మన కమ్యూనిటీలో అభద్రతాభావానికి చోటులేదని, అందరూ గౌరవంగా, సెక్యూర్డ్ గా ఉండేలా మనమంతా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు.

### బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లు వాడితే..

# ఆ దేశాలపై అణుదాడి చేస్తాం..

మొదటి పేజి తరువాయి

ఒకవేళ అణ్వాయుధ రహిత దేశం నుంచి తమపై దాడి జరిగితే, ఆ దాడికి అణ్వాయుధ దేశం మద్దతు ఇస్తే, దాన్ని సంయుక్త దాడిగా పరిగణిస్తామని, ఆ సందర్భంలో తాము అణ్వాయుధాన్ని వాడనున్నట్లు పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్ అణ్వాయుధ రహిత దేశమని, ఒకవేళ ఆ దేశం కనుక అణు దాడిలో పాల్గొంటే, దానిపై న్యూక్లియర్ వెపన్ ప్రయోగించే అవకాశాలు ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. పశ్చిమ దేశాలు అందిస్తున్న లాంగ్ రేంజ్ మిస్సైళ్లను ఒకవేళ ఉక్రెయిన్ వాడితే, అప్పుడు ఆ దేశంపై అణు బాంబుతో దాడి చేసే అవకాశాలు ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. బుధవారం నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ ఉన్నతాధికారులతో చర్చించిన ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఒకవేళ రష్యాపై భారీ స్థాయిలో మిస్సైల్ లేదా వైమానిక దాడి జరిగితే, దాని గురించి సమగ్రమైన సమాచారం అందితే, అప్పుడు అణ్వాయుధాన్ని వాడుతామని అన్నారు. రష్యాతో పాటు మిత్రదేశమైన బెలారస్‌పై కూడా దాడి జరిగితే తిప్పికొడుతామన్నారు. శత్రు దేశాలు ఒకవేళ బాలిస్టిక్ లేదా క్రూయిజ్ మిస్సైళ్ల, లేదా వ్యూహాత్మక వైమానిక దాడి, డ్రోన్లను వినియోగించినా.. ఆ దేశాలపై అణ్వాయుధాలతో అటాక్ చేయనున్నట్లు పుతిన్ తెలిపారు. అయితే తాము ప్రకటించిన కొత్త అణు సిద్ధాంతం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్న విషయాన్ని మాత్రం పుతిన్ స్పష్టం చేయలేదు.

# జగన్ క్రిస్టియన్.. తిరుమలలో డిక్లరేషన్ పై సంగతకం చేయాల్సిందే: రఘురామకృష్ణరాజు

మొదటి పేజి తరువాయి

తిరుమలకు చేరుకుని... 29న శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో జగన్ ను ఉద్దేశించి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ క్రిస్టియన్ అనే విషయం అందరికీ తెలిసిందేనని రఘురాజు అన్నారు. అన్య మతస్తులు ఎవరు తిరుమలకు వెళ్లినా రూల్స్ పాటించాల్సిందేనని చెప్పారు. హిందూమతం పట్ల, స్వామివారి పట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. తిరుమల లడ్డూను వాసన చూసి వదిలేయకుండా నిండు విశ్వాసంతో లడ్డూను తినాలని చెప్పారు. తప్పు చేసిన జగన్ ను పాప పరిహారం చేసుకోవడానికి వేంకటేశ్వరస్వామి తిరుమలకు పిలిచినందుకు సంతోషంగా ఉందని రఘురాజు అన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత స్వామివారి లడ్డూని స్వచ్ఛమైన నేతితో అద్భుతంగా చేయిస్తున్నారని కొనియడారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఎలాంటి దోషాలు జరగకుండా హిందూ మనోభావాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

# మీడియా ప్రతినిధులపై కర్ణాటక సీఎం అసహనం

మొదటి పేజి తరువాయి

మీడియా ప్రతినిధుల మైక్‌ను పక్కకు తోసేశారు. అవసరమైతే తాను మీడియాను పిలిచి మాట్లాడుతానని తెలిపారు. కర్ణాటకలో మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్కాంలో సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన ముడా స్కాంలో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతి ఇచ్చారు. దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లగా, గవర్నర్ అనుమతి ఇవ్వడం చట్టబద్ధమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సిద్ధరామయ్య తన సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ డిమాండ్ చేస్తున్నాయి. ప్రతిపక్షాల డిమాండ్‌పై స్పందించాలని మీడియా ప్రతినిధులు అడగగా... సిద్ధరామయ్య సహనం కోల్పోయారు.

రాజీనామా చేసేది లేదు : - తాను రాజీనామా చేసే ప్రసక్తి లేదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. గతంలో మాజీ సీఎం కుమారస్వామిపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు రాజీనామా చేయలేదన్నారు. "నేను రాజీనామా చేయను... ఎందుకు రాజీనామా చేయాలి?" అని ప్రశ్నించారు. మొదట కుమారస్వామిని రాజీనామా చేయనీయండన్నారు.

# పవన్ దీక్షా దక్షతలను ఎందుకు ప్రశ్నిస్తున్నారు

మొదటి పేజి తరువాయి



అలా ఎందుకు జరుగుతోంది అన్నదే ఇక్కడ చర్చ. ఉదాహరణకు తీసుకుంటే తిరుపతి లడ్డూ అపవిత్రం అయింది అని పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. అది ఇపుడు విమర్శల పాలు అవుతోంది. పవన్ కి దీక్షలు చేసే స్వేచ్ఛ లేదా అంటే లేకేమి ఆయన బ్రహ్మాండంగా చేయవచ్చు అన్న సమాధానమూ వస్తుంది. అయితే పవన్ ఇపుడు ఉన్న పరిస్థితి ఆయన ఉన్న పొజిషన్ చూసిన వారు మాత్రం దానిని తప్పు పడుతున్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారు. పవన్ కళ్యాణ్ ముందు ఏదైనా సమస్య వస్తే ఆయన దానిని అధికారిక స్థాయిలో పరిష్కరించగలిగే స్థితిలో ఉన్నారు. అధికార మంత్ర దండం ఆయన చేతిలో ఉంది. చట్టం ఆయన దగ్గర ఉంది. మరి ఇన్ని ఉంచుకుని ఆయన సామాన్యుల మాదిరిగా ఇంకా చెప్పాలీ అంటే విపక్ష పాత్రలోకి వెళ్ళి ఎందుకు ఆందోళన బాటలు పడుతున్నారు అన్నదే ప్రశ్న. ప్రాయశ్చిత్త దీక్ష సాధారణంగా ఎవరు చేసుకుంటారు అంటే తప్పు చేసిన వారు. మరి పవన్ ఏ తప్పు చేశారని ఈ దీక్ష అంటే జవాబు లేదు. ఆయన అధికారంలో ఉండగా తప్పు జరిగితే శాఖాపరమైన విచారణ జరిపించి దానికి సరైన పరిష్కారం కనుగొనాలి. అదే రాజధర్మం. అదే ప్రజలు కూడా ఆశించేది. ఇక ఆయన అధికారంలో లేని టైం లో గత ప్రభుత్వం లో తప్పులు జరిగాయి అంటే ఆ విషయంలోనూ ఒక సమగ్రమైన విచారణ జరిపించాలి. బాధ్యులను వెతికి పట్టుకోవాలి. ఒక వేళ ప్రాయశ్చిత్తం అంటూ చేస్తే ఆ తప్పులు చేసిన వారే చేయాలి. మరి పవన్ ఎందుకు ఈ దీక్షలు చేస్తున్నారు అన్నదే అర్థం కావడం లేదు అని అంటున్నారు. పైగా ఆయన రాజ్యాంగ పదవిలో ఉన్నారు అంటే సర్వ మతాలు సమానం అని చాటి చెప్పే పొజిషన్ లో ఉన్నారు అని చెప్పాలి. ఆయన ముందు ఏ మతం సమస్య అయినా ఏ వర్గం సమస్య అయినా వచ్చినా దానికి ఒకే విధంగా రాజ్యాంగంలో సూచించిన మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలా కాకుండా ఆయన ప్రాయశ్చిత్తం దీక్షలు అంటూ చేయడం అంటే అది ఒక విధంగా పలాయనవాదం కాదా అన్న చర్చ కూడా లేవనెత్తుతున్నారు. అన్నింటికీ మించి పవన్ తాను అధికారంలో ఉన్నాను అన్న దాన్ని విస్మరిస్తున్నారా అన్న చర్చ కూడా వస్తోంది. అందుకే పవన్ దీక్షా దక్షత్లా మీద ఇపుడు ప్రశ్నలు సందేహాలు వ్యక్తం చేసేవారు బాగా అధికం అవుతున్నారు. ఇక్కడ మరో విషయం కూడా ఉంది. అధికారంలో ఉన్న వారు ఆరోపణలు చేయకూడదు, అనుమానాలు అంతకంటే వ్యక్తం చేయకూడదు, వారు ఫుల్ పవర్స్ కలిగి ఉన్నారు కాబట్టి అలా వచ్చిన వాటిని పూర్తి స్థాయిలో వారు పరిష్కరించగలిగి ఉండాలి. కానీ అపోవడం లా జరగకవల్లనే ఇపుడు ఈ రకమైన చర్చ సాగుతోంది. రాష్ట్రంలో చూస్తే లడ్డూ ప్రసాదాలలో కల్తీ విషయంజరిగింది అన్నది ఒక ఆరోపణ. దానిని చేసిన వారు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వారు. దాని మీద బిగ్గరగా మాట్లాడుతున్న వారు ఉప ముఖ్యమంత్రి సహా కీలక నేతలు. అయితే అధికారంలో ఉన్న వారు ఆరోపణల నిగ్గు తేల్చాలి కానీ విమర్శలు ప్రతి విమర్శలతో రాజకీయం చేయడమేంటి అన్నదే ఇపుడు హాట్ డిబేట్ గా ఉంది. ఏది ఏమైనా పవన్ వ్యక్తిగత స్థాయిలో దీక్షలు చేసుకోవచ్చు కానీ ఆయన డిప్యూటీ సీఎం గా కూడా రాజ్యాంగం ప్రసాదించిన తన హక్కులను బాధ్యతలను పూర్తి స్థాయిలో డిశ్చార్జి చేస్తేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని అంటున్నారు.

# 3 పార్టీల పోటాపోటీ.. 40 మంది ఎమ్మెల్యేలు.. తెలంగాణలో మరో ఎన్నిక..

మొదటి పేజి తరువాయి



కాంగ్రెస్ పార్టీకి సిటింగ్ స్థానం కావడం.మూడు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకం తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మూడూ గట్టిగా తలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో జరగనున్న ఎన్నిక ఆసక్తి రేపుతోంది. కానీ, ఇదేమీ లోక్ సభ, శాసన సభ ఎన్నిక కాదు.. చట్టసభ అయిన శాసన మండలి స్థానం. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక. దీని టికెట్ కోసం పార్టీల్లోనే నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇదంతా కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ సెగ్మెంట్ గురించి. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 40 అసెంబ్లీ సీట్లున్నాయి. కరీంనగర్ ఎమ్మెల్సీ సీటు కాంగ్రెస్ సిటింగ్ స్థానం. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడిపోకూడదని భావిస్తోంది. ఇక బీఆర్ఎస్ కు ఉత్తర తెలంగాణ ఆయువుపట్టు. అలాంటిచోట ఎమ్మెల్సీ కూడా ఓడితే పెద్ద దెబ్బనే. గెలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై పట్టభద్రుల్లో వ్యతిరేకత ఉందని ప్రచారం చేయొచ్చు. మరోవైపు బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహించేది కరీంనగర్ నుంచే. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ లలో ఆ పార్టీ ఎంపీలే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై యువతలో మంచి అభిప్రాయం ఉందని చాటేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలో గెలవడం చాలా కీలకం. నాలుగు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంకా నోటిఫికేషన్ కూడా రాలేదు. కానీ, ఇప్పటినుంచే ప్రచారం మొదలైంది. తమ అభ్యర్థిత్వాన్ని బలపరచాలంటూ గ్రాడ్యుయేట్లను కోరుతున్నారు వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు పార్టీ నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతకాలం పార్టీలను అంటీముట్టనట్లుగా ఉన్న నాయకులు కూడా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పార్టీలతో సంబంధం లేనివారూ రంగంలోకి దిగనుండడంతో ఎమ్మెల్సీ ఎన్నిక పార్టీలు-సామాన్యులు అన్నట్లుగా మారింది. కాంగ్రెస్‌లో పెరిగిన పోటీ ఇది కాంగ్రెస్ సీటు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గెలుచుకున్న సీటును అధికారంలోకి వచ్చాక చేజార్చుకుంటే రాజకీయంగా పెద్ద దెబ్బ అవుతుంది. ఇక తమ కంచుకోటలో తిరిగి సత్తా చాటాలని బీఆర్ఎస్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఓసారి స్వామిగౌడ్ గెలవగా, 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి విజయం సాధించారు. జీవన్ రెడ్డితో పాటు ఇప్పుడు వెలిచాల రాజేందర్ రావు, మేనేని రోహితరావు, ప్రణవ్ బాబు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నరేందర్ రెడ్డి సొంతంగా అయినా పోటీకి సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడికి కాంగ్రెస్ టికెట్ నిరాకరిస్తుందా? మొన్నటి లోక్ సభ ఎన్నికల్లో ఆయనను ఎంపీగానూ పోటీకి నిలిపింది. జీవన్ రెడ్డి పోటీ చేస్తారా లేదా అన్నది కూడా ఆసక్తికరమే. బీఆర్ఎస్ నుంచి యాదగిరి శేఖర్ రావు గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ కూడా పోటీలో ఉన్నారు. 4 ఎంపీలు.. ఒక ఎమ్మెల్సీ.. నాలుగు ఉమ్మడి జిల్లా కేంద్రాల ఎంపీలూ బీజేపీ వారే. అందుకని ఆ పార్టీ నుంచి పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. పొలసాని సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాణి రుద్రమ, జగిత్యాల జిల్లా నుంచి మాజీ మున్సిపల్ చైర్మన్ బోగ శ్రావణి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.ఎన్ రావు కూడా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల కాక పెరిగేనాటికి పరిస్థితులు ఇంకా మారవచ్చు. ఒక పార్టీ నుంచి టికెట్ రానివారు రెబల్ గా బరిలోకి దిగొచ్చు? చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# హైడ్రా బాధితులకు అండగా ఉంటాం... అక్కడకు రండి: కేటీఆర్

మొదటి పేజి తరువాయి

తమకు ఓటు వేసి గెలిపించినందుకు హైదరాబాద్ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అక్కడకు రాలేని పరిస్థితుల్లో హైదరాబాద్‌లో దాదాపు అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ కార్పోరేటర్లే ఉన్నారని, వారి వద్దకు వెళ్లవచ్చన్నారు. న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలని న్యాయస్థానం ద్వారానే ప్రభుత్వానికి చెప్పిస్తామని తెలిపారు. పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. సామాన్యుల పట్ల అమానవీయంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే వారు చాలా చిన్న చిన్న వాళ్లేనని అన్నారు. ఆక్రమణల తొలగింపు మంచిదే కానీ... ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి వారిని అక్కడి నుంచి పంపించాలని సూచించారు. కోటీశ్వరుల ఆక్రమణలు కూల్చివేస్తే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చుని... కానీ సామాన్యులు ఇబ్బంది పడతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ శాఖ ఏం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. కొంతమంది నివాసాలు రిజిస్ట్రేషన్ అయిన మూడు రోజులకే కూల్చివేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని నిలదీశారు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. అందుకే అన్యాయం జరుగుతున్న వారికి అండగా ఉండాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. తాము పేదల వద్దకు వెళ్లి... బుల్డోజర్లను అడ్డుకుంటామన్నారు. తాము ఆక్రమణలను ప్రోత్సహించడం లేదని, కానీ మానవీయ కోణంలో ఆలోచించాలని సూచిస్తున్నామన్నారు. అయినా, ఆక్రమణలు అన్నీ కాంగ్రెస్ వారివే ఉంటాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం చేద్దామని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. ఆక్రమణలన్నింటినీ కూలగొట్టాలని ప్రభుత్వం భావిస్తే జీహెచ్ఎంసీ కార్యాలయం నాలా మీదనే ఉందని గుర్తించాలన్నారు. మంత్రులు ఇళ్లు, ఫామ్ హౌస్‌లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని ఆరోపించారు.

### కుదురుపాకలో స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నానని కేటీఆర్ ట్వీట్

పెద్దపల్లి జిల్లాలోని కుదురుపాకలో కేటీఆర్ ఈ రోజు స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన గ్రాండ్ పేరెంట్స్ జె.కేశవరావు, లక్ష్మీల జ్ఞాపకార్థం ఈ స్కూల్ భవంతిని నిర్మించినట్లు తెలిపారు.

# పదేండ్లు విధ్వంసమైన తెలంగాణ పునర్నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన 1540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల నోటిఫికేషన్ లో ఉద్యోగాలు సాధించి ఆర్ అండ్ బీ శాఖకు కేటాయించబడిన 156 మంది ఏఈఈలకు గురువారం మాదాపూర్ న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్) లో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్లు విధ్వంసమైన తెలంగాణ పునర్నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, కొందరు పాలకులు, అతికొద్దిమంది ఇంజనీర్ల స్వార్థం యావత్ ఇంజనీర్లందరికి మాయని మచ్చగా మారిందన్నారు. మీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్యనో, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలి కానీ కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదని మీ అందరిని కోరుకుంటున్నాని అన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన సంఘటనలను మనం చూశామన్న మంత్రి దయచేసి అలాంటి ఇంజనీర్లను కనీసం కలలోకి కూడా రానివ్వకండని సలహా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మీ కొత్త ఇంజనీర్ల పట్ల అత్యంత ఆశాభావంతో ఉందని, మీరంతా మీకు అప్పగించిన పనిని నిబద్ధతతో చేస్తే మన రాష్ట్రం ప్రగతిబాటలో సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ప్రస్తుతం ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో రాష్ట్ర ప్రగతిలో కీలకమైన సూపర్ గేమ్ ఛేంజర్ లాంటి ట్రిపుల్ ఆర్ తో పాటు, టిమ్స్ హాస్పిటల్ భవనాలు, జిల్లాల్లో పరిపాలనపరమైన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని వెల్లడించారు. మీరంతా కొత్తగా ఎంపికై ఉద్యోగాల్లోకి చేరుకుంటున్న ఈ సమయంలో మీరు నిర్మించేంది కేవలం రోడ్డో, బ్రిడ్జినో, భవనమో కాదని, అది లక్షల మంది అవసరాలు తీర్చే ఒక కట్టడం అన్న సంగతిని గుర్తెరగాలని సూచించారు. మీరు చేయిస్తున్న ప్రతీ పని మాదో, మీదో కాదని, రాష్ట్ర ప్రజల సంపదను బాధ్యతగా వారి కోసం వినియోగించే ఒక యజ్ఞంగా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

రిక్రూట్మెంట్లను వేగవంతం చేసి పోస్టింగులు ఇచ్చాము.. :- గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆగం చేసిందని, గత ప్రభుత్వం 10 మండలానికో ఇంజనీర్ కూడా లేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొస్తే మేం రిక్రూట్మెంట్లు పూర్తి చేసి ఆర్ అండ్ బీని పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమం 5 రోజులపాటు సాగుతుందని, కొత్త ఇంజనీర్లను అద్భుతంగా తీర్చిదిద్ది ఫీల్డ్ కు పంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...

మొదటి పేజి తరువాయి

చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంపికైన లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీలను గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఒకటి రెండు రోజుల్లో రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైనవారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇక ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే, ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు సీఎం. ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం అధికారులను దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డాటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సీఎం ఆదేశించారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే,ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అదేశించారు. రాజీవ్ స్వగృహాలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదన్నారు. వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా, వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు.

# కొత్త మద్యం షాపులు వారికే, మార్గదర్శకాలు - ఫీజు ఖరారు..!!

ఎక్సైజ్ శాఖ తుది కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ల కోటాలోని షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై అబ్కారీ శాఖ కసరత్తు చేస్తోంది.

కల్లుగీత వృత్తి కులాల జనాభా ఏయే జిల్లాల్లో ఏ మేరకు ఉన్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు. లైసెన్సు ఫీజు పైన ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు.

నోటిఫికేషన్ :- ఏపీలో కొత్త మద్యం షాపుల నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమవుతోంది. రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇందులో 340 షాపులు కల్లుగీత వృత్తి దారులకు కేటాయించనున్నారు. రిజర్వేషన్ల కోటాలోని షాపులను ఎక్కడెక్కడ కేటాయించాలన్న అంశంపై అబ్కారీ శాఖ కసరత్తు చేస్తోంది. కల్లుగీత వృత్తి కులాల జనాభా ప్రాతిపదికనే మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ రిజర్వు చేయనుంది. నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం అమ్మకాల కోసం ప్రైవేట్ రిటైల్ విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రెండేళ్ల పరిమితి :- ఈ నూతన విధానం రెండేళ్ల కాలపరిమితి ఉండేలా నిర్ణయించారు. దీని ద్వారా రిటైలర్ల ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. తక్కువ ధరకే నాణ్యమైన పలు రకాల మద్యాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది. ఇతర రాష్ట్రాల్లో చీప్ లిక్కర్ ధరలను పరిశీలించిన ప్రభుత్వం..ఏపీలో క్వార్టర్ రూ.99గా ఉండాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో కొత్తగా పుట్టుకొచ్చిన బ్రాండ్లను తొలగించి, వాటి స్థానంలో గతంలో ఉన్న పాపులర్ బ్రాండ్లను ప్రవేశపెట్టనుంది. సాధారణ లిక్కర్ షాపులతో పాటు కేవలం ప్రీమియం రకం మద్యం బ్రాండ్లు దొరికే ఎలైట్ షాపులకూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది.

ఫీజులపై నిర్ణయం :- రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎలైట్ షాపుల ప్రారంభానికి అనుమతివ్వనుంది. లైసెన్సీలు వారి షాపుల పక్కన వాక్ ఇన్ స్టోర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికోసం లైసెన్సీలు అదనంగా రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి. డ్రాట్ బీరు తయారు చేసి, విక్రయించే మైక్రో బ్రూవరీలకు మళ్లీ అనుమతివ్వనున్నారు. మైక్రో బ్రూవరీల్లో అప్పటికప్పుడు బీరును తయారుచేసి విక్రయిస్తారు. మైక్రో బ్రూవరీ ఏర్పాటు చేసుకునే వారు బార్‌తో సమానంగా లైసెన్సు ఫీజు చెల్లించేలా నోటిఫికేషన్ జారీకి తుది కసరత్తు జరుగుతోంది.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
శనివారం - 28 - సెప్టెంబర్ - 2024

## సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో, మహాత్మ జ్యోతిబా పూలే స్థాపించిన 152.వ. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవ సభ వల్లమూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది



పోలవరం (గౌతమ్ న్యూస్): ఈ సభ లో సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ధర్మల సురేష్ మాట్లాడుతూ నాడు సమాజంలో నిమ్న జాతులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే పోరాటాలు , చేశారు ఆనాడు పెత్తందారులకు వ్యతిరేకంగా శూద్రులకు అతిశూద్రులకు విద్య అందించిన మహా వ్యక్తులని అన్నారు ఆనాడు సమాజంలో శూద్రులపై అతిశూద్రులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సత్యశోధక సమాజ్ స్థాపించి నేటికీ 152 సంవత్సరాలు కావస్తున్న భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు కావస్తున్న భారతదేశంలో ఆదివాసీలపై దళితులపై ప్రత్యక్షంగానో పరోక్షంగానో దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు బిజెపి ప్రభుత్వం తినే తిండి మీద ఆంక్షలు పెడుతుందని జాతులు మధ్య కులాల చిచ్చు మతాల చిచ్చు రేపుతూ మనుషుల మధ్య ఎక్కువ తక్కువ అనే కుల నిచ్చెన మెట్ల వ్యవస్థను పెంచి పోషిస్తుందని అన్నారు

## కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘం గౌరవ అధ్యక్షులుగా !!

### ఎల్లేని సుధాకర్ రావు



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘం శుక్రవారం సంభందిత అధికారుల సమక్షంలో ఏర్పాటు. కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘం ఏర్పాటు చేయడమైనది. ఏకగ్రీవంగా సంఘ గౌరవ అధ్యక్షులుగా ఎల్లేని సుధాకర్ రావు ఎన్నుకున్నారు.సంఘం సభ్యులు అధ్యక్షులుగా పెద్దూరి రామస్వామి ఎన్నుకున్నారు. అదేవిధంగా పెబ్బేటి శివకుమార్, ఎర్రమోని రామస్వామి,మానపాడు పెంటమ్మ,పెబ్బేటి స్వప్న,మన్నెమోని పుల్లయ్య,సారాయి శేఖర్,ఎల్లేని కృష్ణారావు,బొబ్బిటి విష్ణువర్ధన్ రెడ్డి గార్లను డైరెక్టర్లుగా ఎన్నుకోవడం జరిగింది. రాబోయే రోజుల్లో మామిడి రైతుల సమస్యలను మరియు నాణ్యత మరియు రాష్ట్ర స్థాయి మామిడి సొసైటీ అనుసంధానం మరియు ఇతర సమస్యలపై రైతులకి అవగాహన కల్పిస్తూ అండగా సంఘం ఉంటుందని స్పష్టం చేశారు సంఘం అనంతరం మామిడి రైతులతో కలుపుకుని అతి త్వరలో సంఘ సభ్యత్వాలు, అధికారులు, మరియు లిఅగ్రికల్చర్,భూసార పరీక్ష కేంద్ర అధికారులచే స్థానిక మరియు రాష్ట్ర వ్యవసాయ మంత్రి గారిని కలుపుకొని త్వరలోనే కొల్లాపూర్ మామిడి రైతుల వర్క్ షాప్ నిర్వహిస్తామని తెలిపారు.. త్వరలో కేంద్ర వ్యవసాయ శాఖామంత్రిగారిని రైతులతో కలిసిలి కొల్లాపూర్ మామిడికీ మంచిరోజులు ఖచ్చితమైన ఫనితనంతో తెచ్చేవిధంగా కృషిచేయడానికీ సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,మామిడి రైతుల సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు....

## శ్రీ మల్లికార్జున స్వామి మెటల్ మర్చంట్ షాప్ ను ప్రారంభించిన సమ్మిగౌడు



మానుకోట జిల్లా ప్రతినిధి/(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో గల శ్రీ మల్లికార్జున స్వామి మెటల్ మర్చంట్ నూతన షాపును శుక్రవారం గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు లాభాలను సమకూర్చేలా భగవంతుడు సహకరించాలని వేడుకున్నారు. సారసమైన ధరలకే నాణ్యమైన వస్తువులు ఇచ్చట లభిస్తాయని ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు.

## 7వార్డులో లో రూ.500/- సిలిండర్ సబ్సిడీ కార్యక్రమం



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యంలో మెటుపల్లి పట్టణంలోని ఇస్లాంపుర 7వ వార్డులో లో రూ.500/- సిలిండర్ సబ్సిడీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెటుపల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం వార్డు ఇంచార్జ్ అబ్దుల్ జాకీర్, 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జాజాల రాజగోపాల్, నిసార్, మజీద్, ఖయూమ్, వార్డు అధికారి నర్సింలు, మహిళలు మరియు లబ్ది దారులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

## కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మల్లాపూర్ మండల్ అధ్యక్షునిగా పుప్పాల వినోద్ పటేల్



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బోయిని హనుమాన్లు శుక్రవారం పట్టణ పార్టీ కార్యాలయంలో లిమాట్లాడుతూ మల్లాపూర్ మండలంలోని పలువురికి మల్లపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఉప అధ్యక్షులు గా నియమి స్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షులుగా పుప్పాల వినోద్ ఉపాధ్యక్షులుగా జకినపెల్లి రాములు .నియమి స్తున్నట్లు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఉప్పల వినోద్ మాట్లాడుతూ.. నా నియమకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ కొమిరెడ్డి కరంచంద్ కి, ఓబిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీ కొమిరెడ్డి విజయ్ ఆజాద్ కి, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోనే ప్రసాద్ కి, జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ కి, జనరల్ సెక్రెటరీ బోయిని హన్మాండ్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగుల శ్రీనివాస్ కంతి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు

# పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన!!

## కేజీబీవీలో వివిధ పోస్టుల భర్తీ!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లాలోని వివిధ మండలాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి వనపర్తి జిల్లా లోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా నిర్వహించినట్లు వనపర్తి జిల్లా



కేజీబీవీ విద్యాలయాల సెక్టోరియల్ అధికారి సుబలక్ష్మి తెలిపారు, జిల్లాలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు 2023 సంవత్సరంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మాత్రమే సర్టిఫికెన పరిశీలన జరిగిందని ఆమె తెలిపారు, 2024 సంవత్సరానికి గాను వనపర్తి జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్టి) పోస్టులు 8, అదేవిధంగా (పిజిఆర్టి )పోస్ట్ గ్రాడ్యుయేషన్ పోస్టులు 4,



వ్యాయామ ఉపాధ్యాయులు ఒకటి తోపాటు ప్రత్యేక అధికారి పోస్టులు (2) చొప్పున మొత్తం15 పోస్టులను భర్తీ చేయుటకు చివరిగా నిర్వహించిన ధృవపత్రాల పరిశీలనలో ఒక్క పోస్టుకు ముగ్గురు చొప్పున 1:3 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా సెక్టోరియల్ అధికారి సుబలక్ష్మీ తెలిపారు, ఈ పోస్టులకు సంబంధించి ధ్రువపత్రాల అనంతరం 1:1 ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అది కూడా ఈనెల 28న చివరి జాబితాను ప్రచురిస్తున్నట్లు ఆమె తెలిపారు,

# క్రమశిక్షణం సిద్ధాంతం గల బిజెపిలో సీనియర్లకు గుర్తింపు లేదు!!

## బిజెపిలో కష్టపడ్డ నాయకులను గుర్తించాలి!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్య దేశంలో అతిపెద్ద జాతీయ పార్టీ కానీ ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో మారముల ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంతాలలో బిజెపి జాడ కనిపించడం లేదు, బిజెపి పార్టీలో సుదీర్ఘకాలం బిజెపి అనుబంధ సంస్థ అయినా రాష్ట్రీయ స్వయంసేవక సంఘ (ఆర్ఎస్ఎస్) విద్యార్థి సంఘమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తో పాటు భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) వంటి అనుబంధ సంస్థలలో చిన్ననాటి నుంచి చివరకు చనిపోయే వరకు పనిచేసిన సీనియర్ నాయకులను గుర్తించడం లేదని విమర్శలుస్తున్నాయి, ఇది నిజం కాదా అంటున్నారు, బిజెపి పార్టీలోని ప్రతి కార్యకర్త ప్రశ్నలు వేస్తున్నారు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల్లో కేవలం ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒక్క పార్లమెంట్ స్థానం అది కూడా మహబూబ్నగర్ ఎంపీ స్థానం డీకే అరుణ స్వల్ప మెజార్టీతో బయటపడింది, కానీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ తెలంగాణలో నామరూపం లేకుండా పోయింది, రాష్ట్రంలో 8



పార్లమెంటు స్థానాలు వచ్చినంత మాత్రాన అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర జిల్లాల్లో కొన్ని సీట్లు గెలుచుకున్న బిజెపి సంకలు గుద్దుకుంటుంది, కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చినంత మాత్రాన తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీ ఘనమైన సీట్లు సాధించే పరిస్థితి లేదు, బిజెపి పార్టీ గ్రామస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి మరో 20 సంవత్సరాల కాలం పడుతుందని రాజకీయ విశ్లేషణ అంటున్నారు, ఇటీవల దేశవ్యాప్తంగా బిజెపి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టిన బిజెపి సభ్యత్వం వల్ల ప్రయోజనం శూన్యం అంటున్నారు మరికొంతమంది, మహబూబ్నగర్ జిల్లాల్లో ఎంతోమంది సీనియర్ నాయకులు బిజెపి పార్టీకి దూరమైపోతున్నారు, ఇప్పటికి కొంతమంది సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీలో ఆత్మవిశ్వాసాన్ని ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా పనిచేసిన కూడా పార్టీ గుర్తించడం లేదని విమర్శలు వస్తున్నాయి, రాజకీయంగా అవగాహన లేని కొంతమంది యువకులను బిజెపి పార్టీ పెద్దపెద్ద పదవులు కట్టబెట్టి యువతతో అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ అది సాధ్యం కాదని తెలుస్తుంది, ఇప్పటికైనా భారతీయ జనతా పార్టీ దాదాపు 40 సంవత్సరాల క్రితం నుంచి బిజెపి పార్టీలో పనిచేసిన నాయకులను గుర్తించి పదవులను అప్పజెప్పాలని అప్పుడే బిజెపి పార్టీ మహబూబ్నగర్ జిల్లాలో బలోపేతం అవుతుందని ఆ పార్టీలోని కొంతమంది కార్యకర్తలు అంటున్నారు,

# వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న బదిలీ!!

## ఎస్సై బదిలీపై ప్రజల ఆందోళన!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలో గత సంవత్సర కాలం క్రితం బాధ్యతలు చేపట్టిన వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న బదిలీ అయినట్లు తెలిసింది, అనతి కాలంలోనే ఆయన బదిలీ పైన వనపర్తి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలుస్తుంది, కొత్తగా వనపర్తి పట్టణ ఎస్సైగా గోపాల్పేట ఎస్సైగా పనిచేస్తున్న హరిప్రసాద్ వస్తున్నట్లు పోలీసులు వర్గాల ద్వారా తెలిసింది, మొత్తం మీద పోలీస్ శాఖలో బదిలీలలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది సంవత్సరం కాలం కాకముందే బదిలీ చేయడం పట్ల శాంతి భద్రతలు, దోపిడీలు , అరాచకాలు, హత్యలు, అత్యాచారాలు వంటి అనేక సంఘటనలు తెలిసిన వ్యక్తులకు తెలుస్తుందని ప్రజలు అంటున్నారు, ఈ బదిలీల వల్ల పోలీస్ శాఖకు



తీరని నష్టం కూడా జరుగుతుందని ప్రజలు అంటున్నారు, అవగాహనతో కొంతకాలం పనిచేసినప్పుడే ప్రతి వ్యక్తి యొక్క కదలికలను గుర్తించే అవకాశం ఉంటుందని, చీటీ మాటికి బదిలీలు కావడం వల్ల రౌడీ షీటర్లు, అక్రమ వడ్డీ వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ మాఫియా, ఇసుక మాఫియా, తోపాటు అనేక శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ప్రజలు అంటున్నారు, పోలీస్ శాఖలోని బదిలీలు అనుభవం అవగాహన ముఖ్యం కాదు ఇప్పుడు బదిలీ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది, అందువల్లనే శాంతి భద్రతలు లోపిస్తున్నాయని ప్రజలు పదేపదే అంటున్నారు, నిజాయితీగా నిక్కచ్చిగా ఉన్నది ఉన్నట్లు లేని లేనట్లు మాట్లాడే మాట్లాడే పోలీస్ అధికారులను ఎస్ఐ తో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్లను, డీఎస్పీ లను బదిలీ చేయడం వల్లనే ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలకు శాంతి లేదు, రాజకీయంగా ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అధికారుల బదిలీలు చేయడం చెప్పిన మాట వినకుంటే సస్పెండ్ చేయడం వంటి అనేక దుర్మార్గమైన చర్యలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లు ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు, ఇప్పటికైనా పోలీసుల బదిలీలలో పారదర్శక పాలన పద్ధతులు అవలంబించాలని రాజకీయ ఒత్తిళ్లకు పోలీస్ శాఖ చెక్కభజన చేయకుండా ఈ రాష్ట్రంలోని శాంతి భద్రతల విషయంలో కీలకపాత్ర పోషించాలని ప్రజలు కోరుతున్నారు, వెంటనే బదిలీలను ఉపసంహరించుకొని కనీసం మూడు సంవత్సరాల వరకు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో నూతనంగా వస్తున్న ఎస్ఐల పైన కూడా ఆరోపణలు వస్తే బదిలీ చేస్తారా అనే ప్రశ్న ప్రజల్లో బలంగా వినిపిస్తుంది, ఎప్పుడు మార్పు వస్తుందో పోలీస్ శాఖలో అప్పుడే ఈ దేశం ఈ రాష్ట్రం బాగుపడుతుంది, ఇటీవల కాలంలో గౌతమ్ న్యూస్ దినపత్రికల్లో ఫ్రెండ్లీ పోలీస్ తెలంగాణలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రచురించినప్పటికీ పోలీసు శాఖలో మాత్రం రాజకీయాలు చుట్టుముట్టు చుట్టుకొని పోలీసులు రాజకీయ ఉచ్చులో పడిపోతున్నారు, తక్షణమే స్వస్తి పలకాలని ప్రజలు కోరుతున్నారు,

## కోయగూడెం ఓసి 2 ఫిట్ 2,3 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం చెల్లించాలని గౌరవ హైకోర్టు తీర్పు, ఆదివాసీల 8 సం,,ల న్యాయ పోరాటం గెలిచింది . నిర్వాసితులకు అండగా సిపిఎం. రేపాకుల శ్రీనివాస్,

# న్యాయం గెలిచింది

టేకులపల్లి (గౌతమ్ న్యూస్): శుక్రవారం:కోయగూడెం ఓసి - 2, ఫిట్ 2,3 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం 6 వారాలలో చెల్లించాలని గౌరవ హైకోర్టు శుక్రవారం నాడు తీర్పు ఇచ్చిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ హైకోర్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని తీర్పు ఇవ్వడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు,,2008 సంవత్సరం లో సింగరేణి సంస్థ కోయగూడెం ఓసి 2, ఫిట్ -2,3 కోసం ఎటువంటి నష్టపరిహారం పునరావాసం చెల్లించకుండా గిరిజనుల సాగుభూములు 750 ఎకరాలు సేకరించిందని తెలిపారు, గిరిజనుల సాగుభూములకు నష్టపరిహారం, పునరావాసం ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనా పోరాటాలు నిర్వహించామని అన్నారు, అదికారులు న్యాయం చేయకపోవడం వల్ల2008లో గౌరవ హైకోర్టు ను ఆశ్రయించామని,2012 సం,,లో నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పు చెప్పిందని తెలిపారు, అప్పుడు సింగరేణి, రెవెన్యూ అధికారులు పునరావాసంగా నామమాత్రపు పరిహారం ఇచ్చి, భూమి నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల మళ్ళీ




2016 సంవత్సరం లో భూమికి బదులు భూమి, నష్టపరిహారం ఇవ్వాలని Wp 12169/2016Wp 12214/2016 గౌరవ హైకోర్టు ను ఆశ్రయించామని అన్నారు, ఎనిమిది సంవత్సరాల న్యాయ పోరాటం నేడు గెలిచిందని ఇప్పటికైనా సింగరేణి రెవెన్యూ అధికారులు షెడ్యూల్ 5ఏరియాలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల కు నష్టపరిహారం చెల్లించి, జీవనాధారం చూపించాలని ఆయన డిమాండ్ చేశారు,ఒక వైపు న్యాయ పోరాటం మరోవైపు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, కాలుష్యం నివారించాలని, ఓసి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని,దారపాడు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించి విజయం సాధించామని అన్నారు,ఈ పోరాటం సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ లు నిర్వాసిత గ్రామాలలో చైతన్య పాదయాత్ర నిర్వహించారని అన్నారు.

## తెలంగాణ సాధన పోరాట యోధుడు

# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



టేకులపల్లి,(గౌతమ్ న్యూస్): భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు స్వాతంత్ర్య సమర యోధుడు,తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ని ఘనంగా నిర్వహించి



నివళులూ అర్పించారు. స్కూలు హెడ్మాస్టర్ యం. జ్యోతి రాణి ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ గుర్రంవిజయలక్ష్మి,విజయ, ఎండీఎం వర్కర్స్ సరోజ,పార్వతి తదితరులు పాల్గొని పుష్పాలు వేసి నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్ర గురించి హెడ్మాస్టర్ యం. జ్యోతి రాణి పిల్లలకు వివరించారు. స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కుల నిర్మూలన అంశాలను పాఠ్యాంశలుగా చేర్చాలి పిడిఎస్ యు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధ సమాజ్ 152 వ ఆవిర్భావ దినం సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం (పిడిఎస్ యు ) ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె గణేష్ మాట్లాడుతూ. సమాజం ఎంత అభివృద్ధిని సాధిస్తున్నప్పటికి సమాజంలో ఇప్పటికి కుల వివక్షత తీవ్రంగానే ఉంది అని వేల సంవత్సరాల నుండి అస్పృశ్యత వ్యవస్థని కాపాడుకుంటూ బ్రాహ్మణీయ భావజాల వ్యవస్థ అంటరానితనంని పెంచి పోషిస్తున్నారు. మనుషుల మధ్య కులం పేరుతో తారతమ్యాలను సృష్టించి కొద్ది శాతం ఉన్న అగ్రకులాలు పెత్తనం చేస్తున్నాయి అని వీటికి తోడుగా కేంద్రలో అధికారంలో ఉన్న బిజెపి వివక్షతను మరింతగా పెంచి పోషిస్తుంది. విద్యాలయాల్లో కుల, మత తత్వాలను పెంచి పోషించే విధంగా నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థుల బుర్రల్లోకి వారి భావజాలను ఎక్కించే ప్రయత్నం చేస్తుంది అన్నారు విద్యాలయాల్లో కావాల్సింది అసమానతలతో కూడిన నూతన విద్యా విధానం కాదని ప్రజలందరూ సమానమే అని బోధించే సమానత్వపు శాస్త్రీయ విద్యా కావాలని అందుకు మహాత్మా జ్యోతిబాపూలే స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలని వారు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి భారత్, నాయకులు. ఎం .చంటి, ఎం సాయికుమార్, శ్రీజ, అనుష, కె .రాజేశ్వరి, ఎన్ .పూజ,ఏ . ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్యదేవోభవ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అరుణ




నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేట హనుమాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణకు జీఎంఆర్, వరలక్ష్మి పౌండేషన్ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆచార్య దేవో భవ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును తూప్రాన్ టీజెఆర్జేసీ పాఠశాలలో ఇచ్చి సత్కరించారు. ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులు అరుణను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

## మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ప్రముఖ సంఘ సేవకులు

### తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా.



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట్ మండలం కొంతాన్ పల్లి గ్రామంలో వంకి పోచమ్మ కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ నిన్న మరణించడం జరిగింది గ్రామస్తులు ద్వారా తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు శివంపేట తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా తన సొంత నిధులనుండి 5000 రూపాయలను స్థానిక బిఆర్ఎస్ నాయకుల చేతుల మీదగా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్ జంగం దేవలింగం, మాజీ ఎంపిటిసి ఆకుల ఇంద్ర శ్రీనివాస్, వంకి అంజయ్య ఉప్పరి నర్సింలు ,వంకి అశోక్, వంకి శ్రీనివాస్, వంకి అశోక్ , అంకర్ల వీరయ్య, రాయేల్లి నరేష్, గొల్ల మధు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన

### శివంపేట్ మండల పిఏసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామ్ రెడ్డి





నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట్ మండల్ కొంతన్ పల్లి గ్రామానికి చెందిన వెంకీ పోచమ్మ గత కొన్ని రోజులు నుండి అనారోగ్యంతో బాధపడుతూ నిన్న సాయంత్రం మరణించడం జరిగింది. ఈ సంఘటన గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఆపద్బాంధవుడు. శివంపేట మండల్ పి ఏ సి ఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి 5000 రూపాలు ఆర్థిక సహాయం వెంకట్రాంరెడ్డి గారి తల్లి చింతల నరసమ్మ చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గొల్ల మధు యాదవ్,చింతల దుర్గారెడ్డి, బొల్లారం కుమార్, గొల్ల యాదగిరి,వంకి శ్రీనివాస్, కాలకంటి నాగరాజ్, వంకి అశోక్,ప్రశాంత్,శ్రీధర్,వెంకటేష్, మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పి డి ఎస్ యు అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

## శాస్త్రీయ విద్యావిధానం కోసం, నవసమాజ నిర్మాణం కోసం పోరాడుదాం



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్ 24న జరగబోయే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం కోరుతూ బయ్యారం మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది. అనంతరం పిడిఎస్యు జిల్లా కోశాధికారి మునగాల మహేష్ అధ్యక్షత వహించిన సభలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నేతకాని రాకేష్ మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్శిటీ లో జార్జ్ రక్తంతో తడిసిన బిగి పిడికిలి పతాకం నేడు విప్లవ విద్యార్థి శ్రేణులకు ఆదర్శమని,తను అమరత్వం పొందిన తర్వాత జె.సి. ఎస్. ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలా శంకర్ స్నేహలత, రంగవల్లి లాంటి వారి త్యాగాల చరిత్రతో విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేసి పీ.డీ.ఎస్.యూ కోట్లాది విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిందని వారు అన్నారు. ఈ దేశంలో పేదలు అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ సమానమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని, విద్యార్థి ఉద్యమాలను కొనసాగిస్తుందని వారు అన్నారు. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయిలో జరిగే 50 అర్ధ శతబ్ద వసంతోత్సవ సభలో 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమాన్ని సమీక్షించి, విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు.సభకు విద్యార్థులు, పూర్వ, ప్రస్తుత పీడీఎస్యు నాయకులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, సభను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పి డి ఎస్ యు 50 వసంతాల ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 4వ తారీఖున జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు పి డి ఎస్ యు జిల్లా నాయకులు విజయ్, వినేష్, ప్రకాష్,సిద్దు, మేఘన, స్రవంతి,భవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలను వినియోగించుకోవాలి..

## పోషణ మాసం సమావేశంలో తాహాసిల్దార్ డి సైదులు..



మరిపెడ (గౌతమ్ న్యూస్): అంగన్వాడి కేంద్రాలను గర్భిణీ స్త్రీలు బాలింతలు తప్పకుండా వినియోగించుకోవాలని అందులో లభిస్తున్న ఫుడ్ బయట ఎక్కడ దొరకదని మరిపెడ తహసిల్దార్ డీ సైదులు సూచించారు. శుక్రవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని ఆడిటోరియం లో మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సిడిపిఓ సిహెచ్ ఎల్లమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి



తహసిల్దార్ డీ సైదులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గుగులోత్ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో బాలమృతం పిండివల్ల పిల్లలకు గర్భిణీలకు ఎంతో శ్రేష్టకరంగా ఉన్నాయని తెలిపారు. అంతేగాక వారు అందిస్తున్న పాలు గుడ్లు పప్పు పిండి పదార్థాల ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది అన్నారు.ఆరోగ్య సూత్రాల ద్వారా ప్రతి ఒక్కరూ పాటించినట్లయితే తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వారందరినీ అంగన్వాడి కేంద్రాలకు పిల్లలను తీసుకొచ్చి సంరక్షించుకోవాలని తాసిల్దార్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గుగులోత్ రవి నాయక్ మాట్లాడుతూ గర్భిణీలను నార్మల్ డెలివరీ కావడానికి ప్రోత్సహించాలని, పాలు గుడ్లు ఆకుకూరలు లాంటి చిరుధాన్యాలతో రక్తహీనత జబ్బులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేగాక బిడ్డ పుట్టినప్పుడు ముర్రుబాలు పట్టించాలని ముర్రుపాలు అమృతంతో సమానమని డాక్టర్ రవి వివరించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతం చేశారు. అంతేగాక అంగన్వాడి కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, రాణి, పద్మ, శ్రీదేవి, కవిత, రూబీనా బేగం, మండలంలోని అంగన్వాడి కేంద్రాలు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మల్లాపూర్ మండల్ అధ్యక్షునిగా పుప్పాల వినోద్ పటేల్



మల్లాపూర్(గౌతమ్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బోయిని హనుమాన్లు శుక్రవారం పట్టణ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలోని పలువురికి మల్లపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఉప అధ్యక్షులు గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షులుగా పుప్పాల వినోద్ ఉపాధ్యక్షులుగా జకినపెల్లి రాములు గార్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఉప్పల వినోద్ మాట్లాడుతూ.. నా నియమకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ కొమిరెడ్డి కరంచంద్ గారికి, ఓబిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీ కొమిరెడ్డి విజయ్ ఆజాద్ గారికి, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోనే ప్రసాద్ గారికి, జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ గారికి, జనరల్ సెక్రెటరీ బోయిని హన్మాండ్లు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగుల శ్రీనివాస్ కంతి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు

## బీవీఆర్ ఐటీ కాలేజీకి చెందిన రెండు కాలేజీ బస్సులు ఢీ..

### డ్రైవర్ మృతి -20 మందికి తీవ్ర గాయాలు







నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒక డ్రైవర్ అక్కడిక్కడేమృతి చెందగా, బస్సులో ఉన్న 20 మంది తీవ్రంగా గాయ పడ్డారు. శుక్రవారం ఉదయం బీవీఆర్ ఐటీ కాలేజీకి చెందిన బస్సులు హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా కాలేజీకి బయలుదేరాయి. స్థానిక క్లాసిక్ గార్డెన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న బస్సులు ఒకదానినొకటి ఢీకొన్నాయి. దీంతో ఒక బస్సుకు చెందిన డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. బస్ లో ప్రయాణిస్తున్న విద్యార్థులకు కూడా గాయాలవడంతో క్షతగాత్రులనుహుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్ సంగారెడ్డి మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు, కళాశాల సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పునరుద్ధరించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

## భద్రకాళి ఆలయంలో "ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్స్" ప్రత్యేక పూజలు

### బ్రోచర్స్ విడుదల చేసిన ఆలయ పూజారి





హనుమకొండ (గౌతమ్ న్యూస్): హనుమకొండ భద్రకాళి దేవాలయం లో ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్స్ చైర్మన్ బానోత్ రవీందర్ మరియు మల్లేశం, కృష్ణ ప్రసాద్ ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రకాళి ఆలయ పూజారి బ్రోచర్స్ ని దేవాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడా లైవ్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు లావుడియా రాజు నాయక్, అలువాల రాజ్ కుమార్, సోమేశ్వర్, ఎండి కాసిం భూక్య మోహన్ నాయక్, అశోక్, పున్నం, కరంటోత్ తిరుపతి నాయక్, లాకవత్ సుమన్, తాళ్లపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆఫీసులో సభ్యత్వం నమోదు,ప్లాట్ బుకింగ్స్ కూడా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన కమిటీ సభ్యులందరికీ ఆకృతి ఇన్ఫ్రా డెవలపర్స్ యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపింది.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ.

### రుణమాఫీ కానీ రైతులు అధైర్య పడవద్దు

### సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి




బయ్యారం,(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో రైతు సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ అనూష అధ్యక్షతన మండల రైతు జనసభ సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మాట్లాడుతూ సంఘంలో సభ్యులు 9 వేలమంది



రైతులున్నారని 2 లక్షల రుణ మాఫీ వచ్చిన వారికి తిరిగి రుణం ఇస్తున్నట్లు తెలిపారు.కొంత మంది సాంకేతిక కారణాలతో రుణ మాఫి కాలేదని ,వాటి వివరాలను వ్యవసాయ అధికారి,వారి సిబ్బంది సేకరించి ప్రత్యేక యాప్ లో పంపిస్తున్నట్లు తెలిపారు. రైతుల నుండి సంఘం అభివృద్ధి కి సలహాలు ,సూచనలు అందించారు. మండలంలో ప్రధాన సమస్య గతంలో పహాణి పై రుణం పొంది , రుణ మాఫి విషయంలో రైతు పట్టాలు ప్రామాణికంగా తీసుకుంటున్నారని ,ధాన్యం అమ్మకాల సమయంలో ఇదె సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ,ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఓ ఆఫీసు నుండి డిస్టిక్ ఆడిటర్ శ్రీనివాస్ బాబు,ఏఓ రాంజీ ,డైరెక్టర్ లు వేల్పుల, శ్రీనివాస్, చాగర్లమూడి భాస్కర్, కసనబోయిన శ్రీనివాస్, చెరుకుపల్లి నాగమణి, నుద్దులూరి యశోద, తెల్లం బిక్షం,, సొసైటీ సిబ్బంది మండల రైతులం తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఘాట్




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో అక్టోబర్ 2 నుండి బతుకమ్మ సంబురాల నేపథ్యంలో టేకులపల్లి గోలియాతండా పంచాయతీ లో ఉన్నా ,శ్రీ కొందండ రామాలయం ముందు ఉన్నా, బతుకమ్మ ఘాట్ శనిటేషన్ పనులు ప్రారంభించిన గోలియాతండ,మరియు టేకులపల్లి పంచాయతీ సిబ్బంది.

## భారీ మొత్తంలో ఎండు గంజాయి పట్టివేత...

**31,75,000/-విలువ గల ఎండు గంజాయి పట్టుకున్న మరిపెడ పోలీసులు.**

**నిందితుడిని వివరాలు తెలియజేసిన జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకెన్.**





మరిపెడ (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా మరిపెడ సర్కిల్ స్టేషన్ లో 31,75,000/- విలువ గల ఎండు గంజాయి పట్టుకున్న మరిపెడ పోలీసులు. హైదరాబాద్ కు తరలిస్తుండగా మరిపెడ మండలంలోని గాలివారి గూడెం వద్ద 127కేజీల స్వాదీనం..

### నిందితుడిని రిమాండ్ కి తరలింపు.కారు స్వాదీనం..



వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.విలేకరుల సమావేశంలో రెండు గంటల ప్రాంతంలో గాలివారిగూడెం స్టేజ్ ఏ యన్ ఆర్ గార్డెన్ సమీపంలోని వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి 127 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారనీ తెలిపారు.నిందితుల వివరాలు: సోడి నాగేశ్వర రావు హెమేశ్వర్, 40 సం.లు., ఏస్ టీ కొయ, రెవెన్యూ డిపార్ట్మెంట్ ఉద్యోగి అసీర్ గూడెం, కుంటా మండలం, సుకుమా జిల్లా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంగంజాయి పట్టుకోవడం లో చాకచక్యంగా విధులు నిర్వహించిన అధికారులకు సిబ్బంది అభినందించి, రివార్డ్స్ అందించారు.

## సెయిల్‌లో వైజాగ్ స్టీల్ విలీనం!

### కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి




న్యూఢిల్లీ, : ఆర్థిక నష్టాల్లో కొనసాగుతున్న ప్రభుత్వరంగ స్టీల్ ఉత్పత్తి సంస్థ రాష్ట్రీయా ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(వైజాగ్ స్టీల్) విక్రయ ప్రతిపాదనపై కేంద్ర సర్కార్ వెనక్కి తగ్గింది. కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మోదీ సర్కార్ మరో ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఈ వైజాగ్ స్టీల్‌ను మరో ప్రభుత్వరంగ సంస్థయైన సెయిల్‌లో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి సెయిల్‌లో విలీన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అలాగే వైజాగ్ స్టీల్‌కు ఉన్న 2వేల ఎకరాల భూములను సైతం ఎన్‌ఎండీసీకి విక్రయించడంతోపాటు సంస్థకు ఉన్న బ్యాంక్ రుణాలకు శాశ్వత పరిష్కారం సూచించబోతున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా డీఎఫ్ఎస్ కార్యదర్శి, స్టీల్ సెక్రటరీతోపాటు బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైజాగ్ స్టీల్‌కు అత్యధికంగా రుణం ఇచ్చింది ఎస్బీఐ కావడం విశేషం. విశాఖపట్నంలో సంస్థకు 75 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి కలిగిన ప్లాంట్ ఉన్నది. ఉక్కు పరిశ్రమకు సొంతంగా గనులు లేకపోవడం వల్లనే నష్టాలు వస్తున్నాయని కార్మిక సంఘాలు ప్రధానంగా ఆరోపిస్తున్నాయి.

## పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్

### మైన్స్ ఎక్స్‌పో-2024 సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: ఐటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, వస్తు సేవల ఉత్పత్తి రంగాల్లో పురోగమిస్తున్న తెలంగాణ..అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని సహకారాన్ని కోరుతోందని, గ్లోబల్ సిటీ అయిన హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరుగుతున్న మైన్స్ ఎక్స్‌పో- 2024 సదస్సులో గురువారం ఆయన ప్రముఖ అమెరికన్ కంపెనీలతో సమావేశమయ్యారు. భారత ఆర్థిక పురోగతిలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్, ఆపిల్ సంస్థలు హైదరాబాద్‌ను తమ స్వస్థలంగా భావిస్తూ.. వ్యా పారాలు నిర్వహిస్తున్నాయని, తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్‌గా రూపుదిద్దుకున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపా యాలు గల హైదరాబాద్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం అని అన్నారు. హైదరాబాద్ టెక్నాలజీ హబ్‌గానే కాకుండా ఫార్మాసిటీ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉంటుందన్నారు. కరోనా విపత్కర సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, బయోలాజికల్-ఈ, భారత్ బయోటెక్ వంటి కంపెనీల ఆవిష్కరణలతో 'వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్'గా నగరం ఖ్యాతి గడించిందని చెప్పారు. ఐటీ అభివృద్ధిలో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణ జరుగుతోందని, ఇక్కడ ఏఐతో నిర్వహించే పరిశ్రమలు, ఏఐ అభివృద్ధి, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్టక్చర్, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్నామని, ఈ విభాగాల్లో ఆసక్తి, అనుభవం ఉన్న కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతుందన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఇంధన, పారిశ్రామిక విధానాలు రూపొందించామని, కొత్త ఆవిష్కరణలకు, ఆర్థికాభివృద్ధికి, పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి ఎక్కువ అవకాశాలున్నాయని తెలి పారు. సదస్సులో ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్‌ను సందర్శించారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు, ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులు, వాటి పనితీరును పరిశీలించారు. సౌత్ ఆఫ్రికా, స్విజర్లాండ్ వంటి దేశాలలో తమ కంపెనీ బెల్టులతో జరుగుతున్న రవాణా ప్రక్రియను స్టాల్ నిర్వాహకులు వివరించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

# గురువును మించిన దైవం లేదు


## ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీంద్రరావు



ఉపాధ్యాయ వృత్తి కంటే ఉన్నతమైన వృత్తి ఏది లేదని, గురువే దైవమని, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు అన్నారు. స్థానిక బాలాజీ గార్డెన్లో పిఆర్టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జంగిలికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుత్తమాల మురళీధర్ స్వామి ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, ఈరోజు అనేక రంగాలలో రాణిస్తున్న ప్రముఖులందరూ ఒకప్పుడు ఉపాధ్యాయులు చెక్కిన శిల్పాలేనని ఆయన అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజమని ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక, సంఘ సేవ, కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ అభ్యున్నతికి పాటుపడాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులందరూ బావి సమాజ నిర్మాణంలో పాల్పడి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తమ పాత్రను పోషించాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మురళీధర్ స్వామి అభ్యుదయ భావజాలం కలిగిన వ్యక్తిని ఆయన అనేకమంది విద్యార్థులను ఉన్నతులు గా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా నుండి ఉమ్మడివరం గల్ జిల్లా వరకు అనేక పాఠశాలలో చేసిన మురళీధర స్వామి ఏ పాఠశాలలోనైనా తనదైన ముద్ర వేసి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డాడని ఆయన అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా ఉంటూ కుటుంబ అభివృద్ధికి పాటు పడాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్టీయూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సంక బద్రి నారాయణ మాట్లాడుతూ మురళీధర్ స్వామి పి ఆర్ టి యు సంఘసేవ చేశారని సంఘ నిర్మాణంలో ఆయన పాత్ర అమోఘమని ఆయన అన్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా, జిల్లా బాధ్యులుగా, రాష్ట్ర బాధ్యులుగా అనేక హోదాల్లో పనిచేసి సంఘ నిర్మాణానికి దోహదపడ్డానని సంక బద్రి నారాయణ అన్నారు. ఈ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నినేని వెంకన్న, ఎడ్ల వేణు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్షులు భూక్యా రామోజీ నాయక్, ప్రధాన కార్యదర్శి కే.సుజాత, పిఆర్టియు రాష్ట్ర నాయకులు, కే ఉపేందర్ రెడ్డి బి.గీత, వై ఉమాదేవి, కె వెంకటరెడ్డి, హల్య నాయక్, విజయ్ కుమార్, మొహమ్మద్ అలీ, శ్యామలాదేవి, కోట కనకయ్య, ఆకారపు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నాగరాజు శంకర్, బోజన్, ప్రవీణ్ మండల శాఖ మాజీ అధ్యక్షులు కె.ఈశ్వర్ కుమార్, పళ్ళ వెంకన్న వెంకటేశ్వరరావు ఆజాద్, సంతోష్, మందుల శ్రీరాములు, వెంకటేశ్వర్లు, లక్ష్మా రెడ్డి, సత్య శంకర్, మండల బాధ్యులు సుశీల, భవాని, సంగీత అనిత, మధు, బాలు, స్నేహలత, కోటేశ్వరరావు వివిధ మండలాల బాధ్యులు ప్రాథమిక సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'హైడ్రా'కు చట్టబద్ధత ఏంటి?

- మళ్లీ అడుగుతున్నాం.. నోడల్ ఏజెన్సీకి ఎందుకంత దూకుడు.. హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం
- ముందు రోజు నోటీసులు ఇచ్చి తెల్లారే కూల్చేస్తారా?
- సెలవు రోజు కూడా కనీస అవకాశం ఇవ్వరా?..
- కోర్టు పరిధిలో ఉన్న ఆస్తిని ఎలా నేలమట్టం చేస్తారు?
- హైడ్రా కమిషనర్ నేరుగా హాజరై వివరణ ఇవ్వాల్సిందే..
- 30న ఉదయం 10.30కు రావాలని కోర్టు ఆదేశం



హైదరాబాద్: ''గతంలోనూ అడిగాం.. మరోసారి అడుగుతున్నాం. 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)'కి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పండి''అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. నోడల్ ఏజెన్సీ ఎందుకు అంత దూకుడుగా వెళ్తుందో అర్థంకావడం లేదని.. శనివారం నోటీసులు అందితే ఆదివారం ఉదయం కూల్చివేస్తారా అని అసహనం వ్యక్తం చేసింది. 'కనీసం సెలవు రోజు కూడా అవకాశం ఇవ్వరా? సోమవారం వరకైనా ఆగే పరిస్థితి లేకపోవడానికి కారణం ఏమిటో చెప్పండి'అని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది. దీనిపై ఈ నెల 30న తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని తేల్చిచెప్పింది.

### కోర్టు పరిధిలో ఉన్నా కూల్చివేతతో..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామపంచాయతీ నుంచి 2022 నవంబర్ 10న మహ్మద్ రఫీ భవన నిర్మాణ అనుమతి పొందారు. ఈ మేరకు సర్వే నంబర్ 165, 166లోని తన 270 గజాల స్థలంలో 24 నెలల్లో అంటే 2024 నవంబర్ 10 కంటే ముందు నిర్మాణం పూర్తి చేయాలి. ఈ మేరకు పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని గణేశ్ అనే నిర్మాణ సంస్థ కొనుగోలు చేసింది. అయితే ఈ నిర్మాణం అక్రమమంటూ తహసీల్దార్, హైడ్రా దాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మహ్మద్ రఫీ, గణేశ్ నిర్మాణ సంస్థ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ సందర్భంగా తాము ఎలాంటి కూల్చివేత కార్యక్రమం చేపట్టడం లేదని, అధికారులెవరూ ఇంతవరకు ఆ భవనాన్ని సందర్శించలేదని హైడ్రా కోర్టుకు వెల్లడించింది. దీంతో పిటిషనర్ల భవనం విషయంలో జోక్యం చేసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ కోర్టు విచారణను ముగించింది. మరోవైపు సదరు భవనానికి నిర్మాణ అనుమతి రద్దు చేస్తూ అధికారులు ఇచ్చిన నోటీసులను కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ పిటిషన్‌లో విచారణ చేపట్టిన కోర్టు.. నోటీసులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. అంతేగాకుండా ఆ నిర్మాణం అక్రమమంటూ, ప్రభుత్వ భూమిలో నిర్మించారంటూ అధికారులు ఇచ్చిన నోటీసులకు పిటిషనర్లు వివరణ కూడా ఇచ్చారు. ఈ వివరణపై సంతృప్తి చెందని తహసీల్దార్.. 48 గంటల్లో బిల్డింగ్ ఖాళీ చేయాలంటూ ఈ నెల 20న స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చారు. 22న కూల్చివేత చేపట్టారు. దీంతో పిటిషనర్లు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు.

### ఒక్కరోజులోనే వచ్చి నేలమట్టం చేశారు..

ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టా రు. పిటిషనర్ తరఫున న్యాయవాది జి.నరేందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ''ఈ నెల 20న ఇచ్చిన స్పీకింగ్ ఆర్డర్ 21న సాయంత్రం పిటిషనర్‌కు అందింది. ఆదివారం ఉద యం 7.30 గంటలకే అధికారులు భవనం వద్దకు వచ్చారు. బుల్డోజర్లు, జేసీబీతోపాటు సిబ్బందిని మోహరించారు. భవనంలోని సామగ్రిని బయటికి విసిరేశారు. విద్యుత్ కట్ చేసి, నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పినా పట్టించుకోలేదు..''అని కోర్టుకు విన్నవించారు. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా అందజేశారు. మరోవైపు హైడ్రా కమిషనర్ ఇచ్చిన రాతపూర్వక వివరాలను హైడ్రా తరఫు స్టాండింగ్ కౌన్సిల్ కటిక రవీందర్‌రెడ్డి కోర్టుకు సమర్పించారు. ''తహసీల్దార్ నుంచి ఈ నెల 21న హైడ్రాకు లేఖ అందింది. జూలై 19న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 99 ప్రకారం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మా బాధ్యత. నోడల్ ఏజెన్సీగా స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామం సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించడానికి తహసీల్దార్ విజ్ఞప్తి మేరకు చర్యలు చేపట్టాం. పోలీసులు, ఇతర సిబ్బందితోపాటు యంత్రాలను పంపించాం''అని కోర్టుకు వివరించారు.

### కోర్టు ఆదేశాలున్నా లెక్క లేదా?

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి హైడ్రాపై ఘాటుగా స్పందించారు. ''భవనం కూల్చివేత కార్యక్రమంలో భాగస్వాములైన అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, పటాన్ చెరు డీఎస్పీ, టీఎస్ఎస్పీడీసీ ఏఈ(ఆపరేషన్స్) చర్యలు చట్టవిరుద్ధం. రిట్ పిటిషన్ 24724/2024లో సెప్టెంబర్ 5న ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించారు. దీనికి సమాధానం చెప్పాల్సిందే. హైడ్రా కమిషనర్‌తోపాటు అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరై వివరణ ఇవ్వాలి. ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు నేరుగా హాజరుకాలేని పక్షంలో వర్చువల్‌గా పాల్గొని సమాధానమివ్వా లి. ఈలోగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సి ల్ తరఫు న్యాయవాది కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలి''అని ఆదేశించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు

### ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు... 15 బృందాలతో ఏకకాలంలో తనిఖీలు



హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లు, వ్యాపార సంస్థలకు చెందిన కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బృందాలు సోదా లు జరిపాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారుల ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నట్టు తెలిసింది. శుక్రవారం ఉదయం 5:30 గంటల నుంచి జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి ఇంటితో పాటు కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లు, పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాల్లోనూ సోదాలు కొనసాగాయి. ఏకకాలంలో మొత్తం 15 ఈడీ అధికారుల బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. విదేశాల నుంచి ఖరీదైన వాచీల కొనుగోలుకు సంబంధించిన ఆరోపణలపై ఈ ఏడాది మార్చి 28న చెన్నై కస్టమ్స్ అధికారులు హర్షరెడ్డికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కస్టమ్స్, డీఆర్ఐ కేసుల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికారులు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు, కేంద్ర బలగాల రక్షణలో సోదాలు కొనసాగాయి. పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు. రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సహా పొంగులేటి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థల ఆర్థికలావాదేవీలపైన ఆరా తీసినట్టు సమాచారం. కేసు వివరాలివీ..: హాంగ్‌కాంగ్‌లో నివాసముండే మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్ ఈ ఏడాది ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చాడు. అతని వద్ద కస్టమ్స్ అధికారులు విదేశాలకు చెందిన రెండు లగ్జరీ వాచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించగా, మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు వెల్లడించాడు. ఈ క్రమంలో నవీన్‌కుమార్ ద్వారా పొంగులేటి కుమారుడు హర్షరెడ్డి ముబీన్ నుంచి దాదాపు రూ.7 కోట్లు విలువ చేసే ఏడు లగ్జరీ వాచ్‌లను కొనుగోలు చేసినట్టు ఆరోపణలున్నాయి. దీనిపై సమాధానం ఇవ్వాలని కస్టమ్స్ అధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ.100 కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. దీంతోమనీలాండరింగ్ కోణంలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

ఈడీ దాడులను ఖండించిన మంత్రి సీతక్క

ఈడీ దాడులను మంత్రి సీతక్క ఖండించారు. 'ప్రతిపక్ష ప్రభుత్వాలున్న చోట బీజేపీ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. ఈడీ, సీబీఐలను పచ్చిగా దుర్వినియోగం చేస్తోంది. తమకు అనుకూలంగా రాజ్యాంగ విరుద్ధంగా దర్యాప్తు సంస్థలను వాడుకుంటోంది' అని సీతక్క ఒక ప్రకటనలో మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడీ అధికారులకు సోదాలకు కారణం బీజేపీ కుట్రలేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తెలిపారు.

## గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



లక్డీకాపూల్ (హైదరాబాద్): గల్ఫ్ దేశాల్లో ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసిందన్నారు. గల్ఫ్‌లో పనిచేసే కార్మికుల కుటుంబాల పిల్లల చదువుకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని చెప్పారు. శుక్రవారం బేగంపేట్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం.. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న షేక్ హుస్సేన్ కుటుంబం నుంచి మొదటి అభ్యర్థనను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో గల్ఫ్ కార్మికుల కోసం సలహా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య, ఎన్నారై విభాగం సలహాదారుడు బొజ్జ అమరేందర్‌రెడ్డి, ప్రతినిధులు భీంరెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్ రావు, తెలంగాణ ఎన్నారై ఫోరం అధ్యక్షుడు మహ్మద్ జబ్బార్, ఉపాధ్యక్షుడు మహ్మద్ మిస్రీ తదితరులు పాల్గొన్నారు.

### పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దు

హైదరాబాద్: హైడ్రాపై పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దని, అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట...అధికారం కోల్పోయిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. సచివాలయంలో శుక్రవారం పొన్నం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో అక్రమ కట్టడం కడితే కూల్చేస్తామని నాడు కేసీఆర్ అన్నారా లేదా అని పొన్నం ప్రశ్నించారు. మూసీలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్వయంగా నాటి మంత్రి కేటీఆర్ చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని, మూసీ మీద ఉన్న ఇళ్లను మాత్రమే తొలగిస్తున్నామని, వాళ్లకు సొంత ఇళ్లు వచ్చేలా, మెప్మా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి కార్యాచరణ చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు.

# ముంబైని మరోసారి ముంచెత్తనున్న భారీ వర్షాలు



ముంబై : మహారాష్ట్రకు వాతావరణ శాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. మరోసారి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. రెండ్రోజుల క్రితం భారీ వర్షాలు ముంబై నగరాన్ని ముంచెత్తాయి. ఫలితంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జనజీవనం స్తంభించి పోయింది. ఈ తరుణంలో శుక్రవారం మధ్యాహ్నం వాతావరణ శాఖ ముంబైకి మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. బలమైన పశ్చిమ గాలుల కారణంగా శుక్రవారం ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ సందర్భంగా పాల్ఘర్, రాయ్‌గఢ్ పరిసర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అంతేకాదు ముంబైలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలుస్తోంది.

# తెలంగాణలో ఆ రెండు గ్రామాలకు అరుదైన అవార్డులు




హైదరాబాద్,: తెలంగాణ రాష్ట్రానికి రెండు జాతీయ అవార్డులు వరించాయి. ఉత్తమ పర్యాటక గ్రామాలుగా నిర్మల్, సోమశిల అవార్డులు పొందాయి. 2024 సంవత్సరానికి గాను కేంద్ర పర్యాటక శాఖ ఎనిమిది కేటగిరీలలో పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో "క్రాఫ్ట్స్" కేటగిరీలో ఉత్తమ గ్రామంగా నిర్మల్ ఎంపిక కాగా.. "స్పిరిచ్యువల్ - వెల్నెస్ " కేటగిరీలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల గ్రామం ఎంపికైంది. ఈరోజు (శుక్రవారం) ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ అవార్డులను ప్రదానం చేసింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ పర్యాటక గ్రామాలుగా నిర్మల్, సోమశిల ఎంపికైన నేపథ్యంలో ఆ గ్రామాలకు చెందిన అధికారులు అవార్డులను అందుకున్నారు. నిర్మల్ జిల్లా నుంచి అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్. పెంటయ్య... సోమశిల నుంచి పర్యాటక శాఖ అధికారి టి.నర్సింహా ఈ అవార్డులను అందుకున్నారు. కాగా.. ఒక దేశ ఆర్థిక ప్రగతిని ప్రభావితం చేసే అంశాల్లో పర్యావరణం ఒకటి. ప్రతిదేశంలోనూ చూడదగ్గ ప్రదేశాలు, కట్టడాలు అనేకంగా వుంటాయి. వాటిని అభివృద్ధిపరిచి పర్యాటక కేంద్రాలుగా మార్చి ఆదాయ వనరులుగా తీర్చితే దేశం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ఏజెన్సీని ది వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసింది. పర్యాటక అంశాల్లో ఈ అంతర్జాతీయ టూరిజం సంస్థ ప్రపంచ వేదికగా పనిచేస్తోంది. ఇది ఒక్కో సంవత్సరం ఒక్కో కాన్సెప్ట్ పేరిట వరల్డ్ టూరిజం డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది "పర్యాటకం- శాంతి" నినాదంతో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. పర్యాటక రంగం అభివృద్ధిలో పయనించాలంటే ముందుగా ప్రభుత్వాలు అవసరమైన నిధులను సమకూర్చాలి. పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని పరిగణలోకి తీసుకుని అక్కడ సదుపాయాలను తీర్చాలి. అంతకంటే ముఖ్యంగా ఆయా పర్యాటక ప్రాంతాల గురించి విస్తృతమైన ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అప్పుడే ఆయా పర్యాటక ప్రాంతాలను సందర్శించాలన్న ఉత్సాహం ఏర్పడుతోంది. తెలంగాణలో ఎన్నో అందమైన ప్రదేశాల ఉన్నాయి. ఉరుకులు పరుగుల జీవితానికి కాస్త విరామం ఇచ్చేందుకు అనేక మంది మంచి మంచి ప్రదేశాలకు వెళ్లాలని అనుకుంటుంటారు. ప్రకృతి అందాలు, చుట్టూతా పచ్చదనంతో ఉండే ప్రదేశాలను పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అనంతగిరి హిల్స్, వరంగల్ భద్రకాళీ టెంపుల్, వేయి స్తంబాల గుడి, నిర్మల జిల్లాలోని బాసర ఆలయం, నిర్మల్ కోట, ఆదిలాబాద్ జైనాత్ ఆలయం, గాయత్రి, కుంటారి, పొచ్చెర జలపాతాలు, నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ ఆలయం, డిచ్‌పల్లి రామాలయాలు, సారంగాపూర్ హనుమాన్ మందిర్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాచీన ఆలయాలు, వారసత్వ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, ఖిల్లాలు, జలపాతలు ఎన్నో తెలంగాణలోని 33 జిల్లాలో విస్తరించి ఉన్నాయి.

# కాంగ్రెస్ సంచలన నిర్ణయం..



**న్యూఢిల్లీ,:**హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార వేడి పతాక స్థాయికి చేరుకుంది. పోలింగ్ గడువు సమీపిస్తోన్న కొద్దీ బహిరంగ సభలు, రోడ్ షోలు హోరెత్తుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి భారతీయ జనతా పార్టీ-జన్ నాయక్ జనతా పార్టీ, ఈ దఫా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే పట్టుదలతో కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలను రూపొందించుకున్నాయి. మొత్తం 90 నియోజకవర్గాలు ఉన్న అసెంబ్లీపై పట్టు సాధించడానికి తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఒకే దశలో పోలింగ్ షెడ్యూల్ అయింది హర్యానాలో. అక్టోబర్ 5వ తేదీన పోలింగ్ జరుగనుంది. 8వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇక్కడ పోల్ అయిన ఓట్లను కూడా అదే రోజున లెక్కిస్తారు. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 73 జనరల్ సీట్లు. 17 స్థానాలు ఎస్సీ రిజర్వ్‌డ్. మొత్తం 20.1 మిలియన్ మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 10.6 మిలియన్ల మంది పురుషులు, 9.5 మిలియన్ల మంది మహిళలు ఉన్నారు. 4,52,000 మంది మొదటి సారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా- ఈ ఎన్నికల్లో మొత్తం 89 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒక్క స్థానాన్ని మాత్రం మిత్రపక్షం సీపీఎంకు కేటాయించారు. ప్రస్తుతం అందరి దృష్టి కూడా జులానా నియోజకవర్గంపైనే ఉంది. దీనికి కారణం- అక్కడ రెజ్లర్ వినేష్ ఫొగట్ పోటీ చేస్తోండటమే. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె బరిలో దిగారు. ఈ పరిణామాల మధ్య పార్టీకి చెందిన 13 మందిపై కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా వేటు వేసింది. ఆరు సంవత్సరాల పాటు వారిని బహిష్కరించింది. ఎన్నికల సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వెల్లడించింది. బహిష్కరణకు గురైన వారిలో నరేష్ ధండే- గుహ్లా, పర్దీప్ గిల్- జింద్, సజ్జన్ సింగ్ ధుల్- పుండ్రి, సునిత బట్టన్- పుండ్రి, రాజీవ్ మామూరామ్ గోండర్- నిలోఖేరీ, దయాల్ సింగ్ శిరోహి- నిలోఖేరీ, విజయ్ జైన్- పానీపట్ రూరల్, దిల్‌బాగ్ సందిల్- ఉఛనా కలాన్, అజిత్ ఫొగట్- దాద్రి, అభిజిత్ సింగ్- భివానీ, సత్‌బీర్ రటేరా- భివానీ ఖేరా, నీతూ మాన్- ప్రిథ్లా, అనితా ధుల్ బద్‌సిక్రి- కలాయత్ ఉన్నారు. ఆరు సంవత్సరాల పాటు వారిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు హర్యానా పీసీసీ చీఫ్ ఉదయ్ భాన్ వెల్లడించారు.

# తిరుమల వెళ్లే ప్రతి ఒక్కరూ తితిదే నిబంధనలు పాటించాలి



అమరావతి: తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ తితిదే నిబంధనలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు " భక్తుల మనోభావాలు, ఆచారాలకు భిన్నంగా ఏ ఒక్కరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్లాది మంది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రం ఏపీలో ఉండటం మనందరి అదృష్టం. ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు అత్యంత నియమనిష్టలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని ఆరాధిస్తారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలు, ఆగమశాస్త్ర ఆచారాలను, తితిదే నిబంధనలను తప్పక పాటించాలని కోరుతున్నా. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

# విష సంస్కృతిలో యువత!



సమాజంలో గ్రామీణ పేద, మధ్య తరగతి యువత కాలాన్ని వృధా చేస్తూ వారి చదువులను పది, ఇంటర్‌లకే పరిమితం చేస్తున్నారు. మెజారిటీ యువత ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో విగ్రహధారణ పేరుతో పూజలు నిర్వహించి తమ విలువైన సమయాన్ని వృధా చేయడానికి పూనుకుంటున్నారు. భక్తి భావం, విగ్రహాలను పూజించడం లాంటివి వారి వారి వ్యక్తిగత విషయం కానీ ఆ విగ్రహాల పేరుతో మనం ఎంత సమయం వృధా అవుతుందో ఒక్కసారిగా ఆలోచన చేద్దాం. పండగ సంబరాల పేరుతో పూజలు నిర్వహించే యువతలో, ఎంత నిబద్ధత ఉందో, ఎంత భక్తి ఉందో ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది. విగ్రహాలు పెట్టడానికి చందాలు వసూల్ చేసి సంబరాలు చేసి, కొంతమంది ఆ వచ్చిన డబ్బులో మిగిలిన దానిని దందాలు చేస్తూ, చిట్టీలు వేస్తూ, మద్యం సేవించడం వంటివి చేస్తున్నారు. కానీ తమకు రావాల్సిన లేదా కావాల్సిన హక్కుల కోసం పది మందిని జతచేసి అడుగు ముందుకు వేయాలనే తపన ఉండడం లేదు.

### ఉన్నత లక్ష్యాలను ఎంచుకోకుండా..

ప్రజాస్వామ్యహితంగా జరిగే ఎన్నికలలో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోకుండా మేము 10 మందిమి ఉన్నామంటూ, ఖర్చులకు డబ్బు, మద్యం ఇతరత్రా అవసరాలు తీర్చుకునేలా వ్యవహరించడం గతంలో కంటే ఈ కాలంలో ఎక్కువ అయింది. అదే పది మంది యువత కలిసి తమ గ్రామ అభివృద్ధి కోసం ప్రశ్నించాలన్న ఆలోచనను మర్చిపోతున్నామన్న విషయాన్ని మనమంతా గుర్తు చేసుకోవాల్సిన అవసరం లేకపోలేదు. ఇలా విగ్రహాలు పెట్టడం, పూజించడం తప్పు పట్టడం లేదు. కానీ ఉన్నత లక్ష్యాలను ఎంచుకోకుండా విగ్రహాలు పెట్టి అక్కడే సమయాన్ని వృధా చేస్తున్నామా? లేదా? మనస్సుతో తేలిక సమయంలో ఆలోచన చేద్దాం. లక్షలాది రూపాయలను ఖర్చుపెట్టి విగ్రహాల వద్ద చీరలు, పండ్లు, ఫలాలు పెట్టి అవి దేవుడివి అని.. వేలం పాట వేసి వాటికి లక్షల రూపాయలు వసూలు చేసి కొనుగోలు చేసిన వారిని గొప్పగా చిత్రీకరించి, కిందిస్థాయి పేద ప్రజలను తక్కువ చేసి చూస్తున్నారు. అలాగే ఆ విగ్రహం ఉన్నన్ని రోజులూ కాలాన్ని వృధా చేస్తూ డీజేలు పెడుతూ మోడ్రన్ విష సంస్కృతి సంప్రదాయాలు, సామ్రాజ్యవాద విష సంస్కృతిలో నిమగ్నమవుతున్నారు. గ్రామాలలో డీజేలు పెట్టి మద్యం తాగి గొడవలు పెట్టుకుని పగలు పెంచుకుని కేసులు నమోదు అయి కోర్టుల చుట్టూ తిరుతున్న యువత లేకపోలేదు. మంచినీటి కంటే కూడా మద్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న కాలంలో యువత తాగుడుకి బానిస అయ్యి అనారోగ్యాల బారిన పడి అకాల మరణాలు చెందుతున్నారు. తల్లిదండ్రులకు ముసలితనంలో బుక్కెడు బువ్వ వేయాల్సిన వాళ్లే చిన్న వయస్సులో అకాల మరణంతో తల్లిదండ్రులకు కన్నీటి శోకం మిగిలిస్తున్నారు.

### పోటీతత్వం ఇందులోనూ ఉండాలి!

ఇలాంటి చేష్టల వలన తల్లిదండ్రులు కలలుగన్న కలలను సహకారం చేయడంలో ప్రతి ఒక్కరం వెనకడుగు వేసినట్టే తప్ప సాధించింది ఏమీ లేదనే స్పష్టం. అందుకే యువత సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, వ్యాపారవేత్తగా ఉన్నత లక్ష్యం వైపుగా అడుగులు వేయాల్సిన అవసరం యువతపై ఉంది. పోటీ ప్రపంచంలో ఉన్నత ఆశయాల వైపు పోటీపడదాం. ఒక బజారులో విగ్రహం పెట్టారని, మన బజారులో విగ్రహం పెట్టాలనే పోటీతత్వం ఉన్నట్లు గానే, ఒక బజారులో ఆ వ్యక్తి ఉన్నత స్థాయిలో ఎదిగాడని, మనం ఎందుకు ఎదగవద్దని, 10 మంది కలిసి గ్రామ, పట్టణ, ప్రాంత అభివృద్ధికి మన పాత్ర కోసం మన స్థానం కోసం అడుగులు వేయాలన్న పోటీ తత్వాన్ని పెంపొందించుకుందాం. నాడు, నేడు సమాజంలో ఉన్నత చదువులు చదివి ప్రజాసమస్యలపై పోరాటాలు చేసి అసువులు బాసిన ఎంతో మంది అమరవీరులు లేకపోలేదు. అలాంటి వారిని స్ఫూర్తిదాయకంగా తీసుకుని వారి చరిత్రను అధ్యయనం చేసేందుకు ప్రయత్నం చేద్దాం.

# విద్యలో గుణాత్మక మార్పు తెస్తుందా!



విద్య సమాజ వికాసానికి గీటురాయి. ప్రజలందరికీ విద్య అందుబాటులో ఉంటే ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది. తద్వారా సాంకేతిక ప్రగతి, సాంఘిక సమానత్వం, సమన్యాయం, అందరికీ దక్కుతాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల ఆర్థిక, సాంఘికాభివృద్ధిలోని వ్యత్యాసాలకు ప్రధాన కారణం విద్యాప్రణాళికలలోని తారతమ్యాలేనని ప్రపంచ అభివృద్ధి నివేదికలు పేర్కొంటున్నాయి. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2021 ప్రకారం, తెలంగాణాలో పేద విద్యార్థుల అభ్యాస ఫలితాలు సరిగా లేవని, విశ్వవిద్యాలయాలలో ప్రచురణ, పరిశోధన ఫలితాలు కూడా తగ్గుతున్నాయనీ, విద్యార్థుల నైపుణ్యం, సామర్థ్యం ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉండటం లేదని తెలుస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అధ్యయనాలు అనేక అంశాలను గుర్తించాయి.

### విద్యలో నైపుణ్య లేమి

అందుకే వీటన్నింటిని అనుసరించి ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక స్థాయి అంటే బాల్యవిద్యను మరింత అందుబాటులోకి తేవడం, అలాగే ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు నైపుణ్యాలు, విద్యార్థుల సమగ్ర సంపూర్ణ అభివృద్ధికై మార్గాల అన్వేషణ, ఉన్నత విద్యాసంస్థలు అప్రెంటిన్షిప్ కాలంలో స్కిల్స్‌ను, ఉపాధితో ఏకీకృతం చేసే విధాన రూపకల్పనలు, చివరిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేయడానికి అవసరమైన నైతిక విలువలతో కూడిన విద్యను అందించే లక్ష్యంగా సిలబస్ మొదలుకుని అన్ని అంశాల అధ్యయనం, మేధోమథనం, కొత్త ఆలోచనలు, ప్రయోగాత్మక పరిశోధనలతో విలువలను పెంచడం, మార్గదర్శకాలు, నియమాలు రూపొందించడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ సమగ్ర విద్యా విధాన రూపకల్పనే దీని ధ్యేయం.

### కమిషన్ ముందు ఎన్నో సవాళ్లు..!

రాష్ట్రంలో విద్యా కమిషన్ నియామకం ఇదే ప్రథమం. ఈ కమిషన్ ముందు అనేక సమస్యలు, సవాళ్లు కలవు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసినప్పటికీ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందనడానికి లేదు. ఎందుకంటే లక్షలాది మంది విద్యార్థులకు విద్యనందించిన వందలాది గురుకుల విద్యాసంస్థలను వివిధ సొసైటీల ఆధ్వర్యంలో నెలకొల్పి నిర్వహిస్తూ వచ్చింది. వాటిలో చదివిన విద్యార్థులు దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన సంస్థలలో ఉన్నత విద్య కోసం ఎంపికయ్యారు. ఉపాధి, ఉద్యోగ పరీక్షలలోను అత్యుత్తమ ఫలితాలను కనబరిచారు. అయితే ప్రభుత్వ యూనివర్సిటీలను పట్టించుకోకుండా ప్రయివేటు యూనివర్సిటీలకు గత ప్రభుత్వం ద్వారాలు తెరిచింది. సాంకేతిక విద్యా విషయంలో ప్రత్యేక కృషి చేయలేదు. కానీ అనేక ఐటీ కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించింది. సింగిల్ డిజిట్‌కే పరిమితమైన మెడికల్ కాలేజీలను పదులసంఖ్యకు పెంచింది. కానీ అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదనేది ముమ్మాటికీ వాస్తవం.

### ప్రయివేట్ భాగస్వామ్యంతో విద్య ప్రమాదం!

ప్రస్తుత విద్యా విధానంలో పాఠశాల స్థాయి వరకే అనేక రకాల పాఠశాలలు ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించబడుతున్నాయి. ఇవిగాక రకరకాల రెసిడెన్షియల్ విద్యాసంస్థలు కలవు. ఈ సంస్థలన్నీ తమకు అనుకూలమైన, అనుగుణమైన విధానాలు రూపొందించుకుని నిర్వహించుకుంటున్నాయి. వీటన్నింటినీ ఒకేచోట ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటు చేసి నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సామాజిక, మత ప్రాతిపదికన ఏర్పడిన గురుకులాలను ఒక చోటికి చేర్చి నిర్వహించాలనుకోవడం కత్తిమీద సామే. అంతేగాకుండా చాలా సంస్థలకు సొంత భవనాలు, సంపూర్ణ సౌకర్యాలు కల్పించబడినవి. వాటిని ఇప్పుడు వదిలేస్తే కోట్లాది ప్రజాధనం వృధానే. ప్రభుత్వం సాంఘిక, లింగభేదాలు, అసమానతలు తొలగించి అన్ని స్థాయిలలో సమానత్వం సాధించేందుకు కృషి చేస్తుందంటూనే, ప్రైవేటు భాగస్వామ్యంతో ముందుకు వెళ్తామని పేర్కొంది. అయితే ప్రయివేటు సంస్థలు నిధులు సమకూర్చితే సమాన అవకాశాల కల్పనపై వాటి ప్రభావం పడుతుంది.


### అభ్యాస ఫలితాల మెరుగుదల ఆవశ్యం!

విద్యాకమిషన్‌కు ఇచ్చిన గడువు రెండు సంవత్సరాలు. రెండు సంవత్సరాలకు అటుఇటుగా ప్రస్తుత ప్రభుత్వ మూడో సంవత్సరపు పాలన కాలంలో కమిషన్ నివేదికను అందజేస్తుంది. అయితే అప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి మిగిలేది రెండు సంవత్సరాలు. నాణ్యత గల విద్యను అందించడం, విద్యార్థి అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం అంటే అది నిరంతర ప్రక్రియ. సంవత్సరాల తరబడి కృషి చేస్తే తప్ప మంచి ఫలితాలను సాధించలేం. మరీ అంత తక్కువ కాలంలో ప్రభుత్వం కమిషన్ సూచనలను ఎలా అమలు చేసి ఫలితాలను రాబడుతుందో వేచిచూడాల్సిందే. అలా కాకుండా కమిషన్ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేస్తూ వెనువెంటనే వాటిని అమలు పరిస్తే బాగుంటుంది. ఉదాహరణకు రాష్ట్రంలో రోజూ ఒకచోట రెసిడెన్షియల్ విద్యాలయాలలో సరైన వసతులు లేవని, నాసిరకమైన ఆహారం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డెక్కడం నిత్యకృత్యమైంది. మరి కమిషన్ రిపోర్ట్ వచ్చే వరకు ఇలాంటి సంఘటనలు జరక్కుండా ఉంటాయా?

### విద్యా బడ్జెట్ పెంపుదలే పరిష్కారం!

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యకోసం బడ్జెట్‌లో పదిహేను శాతం కేటాయిస్తాననడం చాలా సంతోషం. అదే విధంగా మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వం కూడా కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తామని అట్టహాసంగా ప్రకటించి చివరకు హామీగానే మిగిల్చిపోయింది. కాబట్టి కొత్తవి స్థాపించడం కంటే ఉన్నవాటిని బలోపేతం చేస్తూ, నిరంతర పర్యవేక్షణలతో అత్యుత్తమ ఫలితాలను రాబట్టవచ్చును. రాశి కంటే వాసి గొప్పది. పరిమాణాత్మక మార్పు కంటే గుణాత్మక మార్పు సమాజ ప్రగతికి గీటురాయి. కాబట్టి పటిష్ట విద్యా ప్రణాళికలను రూపొందించడం కాదు వాటిని అమలు చేయడం అంతకంటే ముఖ్యం.

# ఓబీసీ క్రీమీలేయర్‌పై పునర్విచారణ అవసరం!



ఎస్సీ వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ.. ఎలాంటి విచారణా పరిధి లేకుండానే క్రీమీలేయర్ ప్రస్తావన తీసుకు రావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ పరిధిని అతిక్రమించారంటూ బహుజన ఉద్యమకారులు, సామాజికవేత్తలూ అభ్యంతరం వ్యక్తపరిచారు. సదరు తీర్పులో క్రీమీలేయర్‌పై న్యాయమూర్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలని పరిగణించేది లేదంటూ.. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ పరిమితి విధించే ఆలోచన లేదంటూ కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయాల్సి వచ్చింది. మరి ఓబీసీ వర్గాలకు మాత్రం క్రీమీలేయర్ నిబంధన సమంజసమేనా? ఇప్పటి వలెనే, నాడు సైతం.. అనగా, మండల్ కమిషన్ తీర్పు సమయంలో.. క్రీమీలేయర్ భావనను అవసరం లేకున్నా తీసుకువచ్చారా రిజర్వేషన్ ఫలాలను అణచివేయబడ్డ వర్గాలకు అందించే క్రమంలో క్రీమీలేయర్ నిబంధన.. అడ్డంకిగా నిలుస్తున్నదా? ఆశయ సాధనకు ఉపకరిస్తున్నదా..? అనే చర్చ నేడు దేశవ్యాప్తంగా సాగుతున్నది. సామాజిక న్యాయమనేది.. మన రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చే ఒక మహత్తర సాధనం. అది గతిశీలమే కాకుండా.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపు మార్చుకుంటుంది.

వ్యతిరేకిస్తున్న వారిని చల్లబరచడానికి..

వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల హక్కును సంక్రమింపజేసిన రాజ్యాంగపు అధికరణలలో ఎక్కడా క్రీమీలేయర్ ప్రస్తావనే లేదు. 7 ఆగస్టు, 1990న.. మండల్ కమిషన్ సిఫారసులు అమలు పరుస్తూ, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్స్ కల్పించనున్నామని నాటి వీపీ సింగ్ ప్రభుత్వం ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలహీన వర్గాల హక్కులను అంగీకరించని ఆధిపత్య వర్గాల వారు గొడవలు సృష్టించారు. ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఇంద్రా సాహ్నీ అనే ఒక లాయర్ వేసిన కేసు సుప్రీంకోర్టుకు చేరింది. ఆ పరిస్థితుల్లో.. వ్యతిరేకిస్తున్న వారిని చల్లబరచడానికి.. ఎవరూ అడగని క్రీమీలేయర్ నిబంధనని న్యాయమూర్తులు ముందుకు తీసుకొచ్చారు.

రిజర్వేషన్ లక్ష్యం పేదరిక నిర్మూలన కాదు..

వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల వెసులుబాటు కల్పించిన రాజ్యాంగ అధికరణం 16(4), సామాజిక వెనుకబాటుకు గురైన వర్గాలకు రాజ్య వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం కల్పించడమే రిజర్వేషన్ల అసలు ఉద్దేశమని స్పష్టీకరిస్తున్నది. రిజర్వేషన్ వ్యవస్థ పేదరిక నిర్మూలన పథకం కాదు. వేల ఏళ్ల కుల వివక్ష కారణంగా ప్రాతినిధ్యానికి నోచుకోని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి తప్ప.. ఆ వర్గాలలోని వారు పేదవారా, సంపన్న వర్గమా.. అనే ప్రశ్న ఉత్పన్నం కారాదు. ఓబీసీ కోటా నియామక ప్రక్రి యలో.. ఆ వర్గంలోని పేదవారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, క్రీమీలేయర్‌గా గుర్తించబడిన వారికి రెండవ ప్రాధాన్యత ఇచ్చే.. ప్రాధాన్యతా విధానం పాటించినా కొంత మేరకు సమంజసంగా ఉండేది. క్రీమీలేయర్ పేరుతో మొత్తానికే మినహాయించిన కారణంగా ఓబీసీ వర్గాలకు దక్కాల్సిన ఉద్యోగాలు ఆధిపత్య వర్గాల పాలవుతున్నాయి. రిజర్వేషన్ వ్యవస్థ లక్ష్యం నీరుగారి పోతున్నది.

మూడు దశాబ్దాలు గడిచినా..

2022-23 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీ వర్గాల వాటా 22 శాతానికే పరిమితమై ఉన్నది. గ్రూప్ -ఏ ఉద్యోగాలలో దక్కిన వాటా కేవలం 18 శాతం మాత్రమే. ఉన్నత స్థాయి బ్యూరోక్రసీలో నామమాత్రం వాటా సైతం లేదు. వివిధ మంత్రిత్వ శాఖలలోని.. జాయింట్ సెక్రటరీ నుండి సెక్రటరీ వరకు ఉన్న అధికారగణం మొత్తం 451 అయితే.. అందులో కేవలం 13 మంది మాత్రమే ఓబీసీలు ఉన్నారు. ఐఐటీ, ఐఐఎం, సెంట్రల్ వర్సిటీలలో ఓబీసీ ప్రొఫెసర్లు ఉన్నది 4 శాతమే. 60 శాతం వరకు జనాభా ఉన్న వర్గానికి 27 శాతం రిజర్వేషన్లు కేటాయించి మూడు దశాబ్దాలు గడిచిన తర్వాత నెలకొన్న పరిస్థితి ఇది! క్రీమీలేయర్, నాట్ ఫౌండ్ సూటబుల్ అనేవి నేటి కాలపు పురుష సూక్తంగా పనిచేస్తూ, కొత్త తరహా మను వ్యవస్థను సృష్టిస్తున్నాయని బహుజన ఉద్యమకారులు ఆక్షేపిస్తున్నారు. జనాభాలో 10% కూడా లేని ఆధిపత్య వర్గాల వారు.. 90 శాతం ఉన్నతోద్యోగాలను తమ గుప్పిట్లోనే నేటికీ పెట్టుకోగలిగారంటే.. కుల వ్యవస్థ ఈ దేశంలో రూపుమాసిందని, గత కాలపు ముచ్చటని.. ఎవరైనా ఎలా అనగలరు?

సామాజిక న్యాయం అందించడం కోసం..

సామాజిక న్యాయం నేడు అందరూ అంగీకరిస్తున్న సత్యం. 35 ఏళ్ల క్రితం.. విశ్వనాథ ప్రతాప్ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసుల అమలుకు పూనుకున్నప్పుడు.. ఆధిపత్య వర్గాలు నానా యాగీ చేశాయి. దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాయి. 1990 పంద్రాగస్టు సంబరాలలో.. ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగరవేసి ప్రసంగించిన వీపీ సింగ్.. 'ఓబీసీ రిజర్వేషన్ల వ్యవస్థ పురుడు పోసుకున్నది. బయటకు వచ్చిన బిడ్డను మళ్లీ తల్లి గర్భంలోకి నెట్టి వేయడం సాధ్యమయ్యే పని కాదు' అంటూ తేల్చి చెప్పేశారు. ఈ మూడు దశాబ్దాలలో బీసీ బిడ్డలకు దక్కాల్సిన సామాజిక న్యాయం గురించి సమాజంలో మరింత సానుకూల వాతావరణం ఏర్పడింది. కులగణన కూడదని వ్యతిరేకించిన వర్గాలు సైతం.. నేడు తమ అభ్యంతరాలని అటకెక్కిస్తున్నాయి. కులగణన అంశానికి ఒక శాస్త్రీయ పరిష్కారం అందించడంతోపాటు క్రీమీలేయర్ నిబంధనపై పునర్విచారణ చేపడితేనే.. మెజారిటీ వర్గాల ఆకాంక్షలకు గుర్తింపు లభించినట్టు అవుతుంది. సామాజిక వివక్ష కారణంగా సమ అభివృద్ధికి నోచుకోని వర్గాలకు సామాజిక న్యాయం అందించడమనేది.. ఆయా వర్గాలకు అందించే భిక్ష కానే కాదు. దేశ పునర్నిర్మాణ ప్రక్రియలో అది ఒక భాగం.

# ఎండ వేడికి గుండె జాగ్రత్త!




గుండెజబ్బు ముప్పు కారకాలనగానే అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు వంటివే గుర్తుకొస్తాయి. అధిక ఉష్ణోగ్రత ప్రభావమూ తక్కువేమీ కాదు. ఇది రోగనిరోధక వ్యవస్థకు చేటు చేస్తుందని.. ఫలితంగా వాపు ప్రక్రియ పెరిగి, గుండెరక్తనాళాల ఆరోగ్యం దెబ్బతింటుందని తాజా అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. వేసవిలో అధిక వేడి మూలంగా వడదెబ్బ, నిస్త్రాణ, పిక్కలు పట్టేయటం, తలనొప్పి, చర్మం కమలటం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. అయితే ఇవే కాదు.. ఇతరత్రా సమస్యల ముప్పూ పొంచి ఉంటుంది. ఉదాహరణకు- గుండెజబ్బులు. అప్పటికే గుండె జబ్బులతో బాధపడుతుంటే తీవ్రమవుతాయి కూడా. ఇంతకీ వేడికీ గుండెకూ ఏంటీ సంబంధం? వాపు ప్రక్రియే. గుండెజబ్బుల విషయంలో అధిక వేడిని అంతగా పట్టించుకోరు గానీ ఇదీ ముఖ్యమైన ముప్పు కారకమేనని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ డేనియల్ డబ్ల్యూ. రిగ్స్ చెబుతున్నారు. వేసవిలో ఎండ ప్రభావానికి గురైనవారి రక్తంలో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) సూచికల మోతాదులు పెరుగుతున్నాయని వివరిస్తున్నారు. అలాగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడే బి కణాల సంఖ్య తగ్గటమూ గమనార్హం. రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాలూ తగ్గుతున్నాయనటానికి ఇది నిదర్శనం. ఇన్‌ఫెక్షన్లు, గాలి ద్వారా వ్యాపించే జబ్బుల వ్యాప్తికి ఉష్ణోగ్రత, తేమ దోహదం చేస్తాయి. అంటే అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశమే కాకుండా వాపు ప్రక్రియతో ముడిపడిన గుండె జబ్బుల వంటి సమస్యల ముప్పూ పెరుగుతుందన్నమాట.

## నెలసరి నిలిచిందా గుండె మరింత జాగ్రత్త!



నెలసరి నిలిచిన (మెనోపాజ్) తర్వాత ఆడవారిలో గుండె ఆరోగ్యం ఊహించిన దాని కన్నా వేగంగా క్షీణిస్తున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. సాధారణంగా మగవారితో పోలిస్తే ఆడవారికి చిన్నవయసులో గుండెపోటు ముప్పు తక్కువ. కానీ నెలసరి నిలిచిన తర్వాత మగవారితో సమానంగా ముప్పు పొంచి ఉంటుందని నిపుణులు చెబుతుంటారు. అయితే దీని కన్నా చాలా ఎక్కువగా ముప్పు పెరుగుతున్నట్టు ఇప్పుడు బయటపడింది. గుండెజబ్బు ముప్పు కారకాలు గల మగవారిని, నెలసరి నిలిచిన మహిళలను ఎంచుకొని పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. వీరంతా కొలెస్ట్రాల్‌ను తగ్గించే స్టాటిన్స్ వాడుతున్నవారే. గుండె రక్తనాళాల్లో ఎంత క్యాల్షియం పోగుపడిందో తెలిపే స్కోరును పరిశీలించగా.. మగవారిలో కన్నా నెలసరి నిలిచిన మహిళల్లో సగటున రెండు రెట్లు ఎక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. నెలసరి నిలిచిన తర్వాత వీరిలో గుండె ఆరోగ్యం చాలా వేగంగా క్షీణిస్తున్నట్టు ఇది తెలియజేస్తోంది. తీవ్ర గుండె సమస్యల విషయంలో వీరికి స్టాటిన్స్ తగినంత రక్షణం కల్పించటం లేదని ఫలితాలు సూచిస్తున్నాయి. ఇంతకీ నెలసరి నిలిచిన తర్వాత ఆడవారిలో పూడికలు ఏర్పడే వేగం ఎందుకు పెరుగుతోంది? చాలావరకూ ఈస్ట్రోజెన్ మోతాదులు వేగంగా తగ్గటమే. స్త్రీ హార్మోన్‌గా భావించే ఈస్ట్రోజెన్ లైంగిక పరమైన అంశాల్లోనే కాకుండా ఇతరత్రా పనుల్లోనూ పాలు పంచుకుంటుంది. రక్తనాళాలు విప్పారేలా చూడటం వీటిల్లో ఒకటి. ఇలా అధిక రక్తపోటు ముప్పును తగ్గిస్తుంది. అంతేకాదు.. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పోగు పడకుండా, గట్టిపడకుండా కాపాడుతుంది. విశృంఖల కణాలనూ నిర్వీర్యం చేసి వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తకుండా చూస్తుంది. నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ మోతాదులు తగ్గటం వల్ల ఇలాంటి రక్షణలన్నీ కొరవడతాయి. కొవ్వు కణజాలం, బరువు పెరగటం.. జీవక్రియల వేగం తగ్గటం, నిద్ర అస్తవ్యస్తం కావటం వంటివీ పొడసూపుతాయి. నిజానికి ఈ విషయం చాలాక్రితమే తెలిసినా ఎంతోమంది మహిళలకు దీని గురించి తెలియదనే చెప్పుకోవాలి. పూడికలు ఏర్పడే వేగం రెట్టింపు అవుతుందనే సంగతి ఇప్పుడు తేలటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అందువల్ల గుండెజబ్బు ముప్పు కారకాలు గల పెద్దవయసు మహిళలు ఒక్క స్టాటిన్స్ మీదే ఆధారపడకుండా క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, కొవ్వు పదార్థాలు తగ్గించుకోవటం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవటం, ఒత్తిడి తగ్గించుకోవటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## చర్మంలో పార్కిన్సన్స్ గుట్టు



తల, చేతుల వంటి భాగాలను వణికించే.. నడక, చురుకుదనాన్ని తగ్గించే పార్కిన్సన్స్ జబ్బును, దీంతో ముడిపడిన సమస్యలను చిన్న చర్మం ముక్క పరీక్షతో గుర్తించొచ్చని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధకులు కనుగొన్నారు. త్వరగా చికిత్స చేయటానికి, సమస్య రకాల మధ్య తేడాలను కచ్చితంగా గుర్తించటానికిది తోడ్పడగలదని భావిస్తున్నారు. పార్కిన్సన్స్‌ను, దీంతో ముడిపడిన సమస్యలను నయం చేసే చికిత్సలేవీ లేవు. ఇవి సంక్లిష్టమైనవి కావటం.. వీటి లక్షణాలు ఇతర జబ్బులను పోలి ఉండటం వల్ల తరచూ పొరపడుతుంటారు. గుర్తించటమూ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఆశలు రేకెత్తిస్తోంది. నిజంగా జబ్బుతో బాధపడేవారిని గుర్తించి, ప్రయోగ పరీక్షలు నిర్వహించటానికి.. త్వరగా కొత్త చికిత్సలను ఆవిష్కరించటానికి వీలుంటుందని ఆశిస్తున్నారు. చికిత్స తీసుకునేవారికీ సరైన మందులను సూచించటానికి తోడ్పడగలదు. పార్కిన్సన్స్, దీంతో ముడిపడిన సమస్యలను సైనుక్లీనోపతీస్‌గా పిలుచుకుంటారు. వీటిల్లో అల్ఫా-సైనుక్లీన్ అనే ప్రొటీన్ అస్తవ్యస్తమవుతుంది మరి. ఈ జబ్బులన్నీ భిన్నంగా ఉంటాయి. చికిత్సలూ వేరే. అయితే ఒకదాని లక్షణాలు మరోదానిలా కనిపించటం, వీటిని కచ్చితంగా గుర్తించే జీవ సూచికలు లేకపోవటం పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఇక్కడే కొత్త అధ్యయనం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ జబ్బులు గలవారి చర్మంలోని నాడీకణాల పోచల్లో ఫాస్ఫోరీలేటెడ్ అల్ఫా-సైనుక్లీన్ (పీ-ఎస్‌వైఎన్) ప్రొటీన్ పోగుపడుతుంది. అదీ జబ్బు తొలిదశలో, లక్షణాలు పైకి కనిపించటానికి చాలా ఏళ్ల ముందుగానే. శరీరంలోని వివిధ భాగాల నుంచి చర్మం ముక్కలను తీసి పరీక్షిస్తే ఇది బయటపడుతుంది. దీని ద్వారా 90% కచ్చితత్వంతో పార్కిన్సన్స్, దీంతో ముడిపడిన సమస్యలను గుర్తించొచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

## మహా మెగ్నీషియం!



మెగ్నీషియం గొప్ప పోషకం. ఇది గుండె లయ, కండరాల సంకోచాలు, రక్తపోటు అదుపు, ఎముక పుష్టి, శక్తిని పుట్టించటం వంటి 300కు పైగా అత్యవసర పనుల్లో పాలు పంచుకుంటుంది. అయినా చాలామందిలో మెగ్నీషియం మోతాదులు తక్కువగానే ఉంటుండటం గమనార్హం. దీన్ని తగినంత లభించేలా చూసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. మెగ్నీషియం చాలా ఆహార పదార్థాలతో సహజంగానే లభిస్తుంది. వయసు, లింగ భేదాన్ని బట్టి మనకు సగటున రోజుకు 310 నుంచి 420 మి.గ్రా. మెగ్నీషియం కావాలి. అలాగని మరీ కొలుచుకొని పదార్థాలను తినాల్సిన అవసరమేమీ లేదు. మెగ్నీషియంతో కూడిన పదార్థాల ఎంపికలో కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు. గింజ పప్పులు, గింజలు: గింజ పప్పులు (నట్స్), గింజలు చిన్నవే గానీ మంచి పోషకాల గనులు. వీటిల్లో ప్రొటీన్లు, పీచు, ఆరోగ్యకర కొవ్వులతో పాటు మెగ్నీషియం వంటి ఖనిజాలూ దండిగా ఉంటాయి. సుమారు 30 గ్రాముల బాదంతో 80 మి.గ్రా., జీడిపప్పుతో 72 మి.గ్రా., వేరుశనగలతో 49 మి.గ్రా., గుమ్మడి గింజలతో 150 మి.గ్రా.




మెగ్నీషియం లభిస్తుంది. చెంచాడు అవిసె గింజలు తీసుకుంటే 40 మి.గ్రా. అందినట్టే. అరకప్పు మొక్కజొన్న గింజలు తింటే 27 మి.గ్రా. లభిస్తుంది. పప్పులు: పప్పు దినుసులూ తక్కువేమీ కాదు. కంది, పెసర, శనగ, మినప వంటి పప్పుల న్నింటిలోనూ మెగ్నీషయం బాగా ఉంటుంది. అరకప్పు ఉడికించిన శనగలతో 60 మి.గ్రా., అనపగింజలతో 40 మి.గ్రా. లభిస్తుంది. పాలు, పెరుగు: పాలు, పెరుగు అనగానే క్యాల్షియమే గుర్తుకొస్తుంది. వీటిల్లో మెగ్నీషియం పాలూ ఎక్కువే. ఒక కప్పు పాలలో 27 మి.గ్రా., పావు కిలో పెరుగులో 42 మి.గ్రా. ఉంటుంది. కూరగాయలు, ఆకు కూరలు: మెగ్నీషియం విషయంలో ముదురు రంగు ఆకు కూరలూ గొప్పవే. అరకప్పు ఉడికించిన పాలకూరతో 78 మి.గ్రా. లభిస్తుంది. అలాగే కూరగాయల్లో అరకప్పు బఠానీల్లో 31 మి.గ్రా., బంగాళా దుంపల్లో 48 మి.గ్రా. ఉంటుంది.

# ఎండ వేడి చల్లగా!

వేసవి అనగానే సెలవుల కాలమే గుర్తుకొస్తుంది. సరదాగా బయటకు వెళ్లటం, షికార్లు చేయటం బాగానే ఉంటుంది గానీ వేడిని తట్టుకోవటమే కష్టం. అప్పుడే ఎండలు ఎలా భగ్గుమంటున్నాయో చూస్తూనే ఉన్నాం. రోజురోజుకీ పెరిగిపోతున్న వేడి కలవర పెడుతోంది. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వేసవి వెంట బెట్టుకొచ్చే సమస్యలూ సరేసరి. చెమట ఎక్కువగా పోయటం వల్ల ఒంట్లో నీరు, లవణాలు తగ్గిపోతాయి. బలహీనత, నీరసం కమ్ముకొస్తాయి. దాహం తీర్చుకోవటానికి ఎక్కడపడితే అక్కడ తాగే నీటితో.. వేడి మూలంగా త్వరగా చెడిపోయే ఆహారంతో విరేచనాలు, కామెర్ల వంటి జబ్బులూ దాడిచేస్తాయి. విష జ్వరాల బెడదా తక్కువేమీ కాదు. కానీ ఆహార, విహారాల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవి బాధలను నివారించుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. సమస్యలు ఎదురైనా ఔషధాలు, చిట్కాలతో ఉపశమనం పొందొచ్చని భరోసా ఇస్తోంది. 'ఖాదీని యాత్మ మనః కాలో దిశస్య ద్రవ్య సంగ్రహః' అని శాస్త్రం చెబుతుంది. అంటే పంచ మహాభూతాలు (భూమి, జలం, వాయువు, అగ్ని, ఆకాశం), ఆత్మ, మనసు, దిక్కులు, కాలం.. ఇవన్నీ కలిసి మనకు కనిపించే అన్నింటినీ తయారుచేస్తాయని అర్థం. వీటిని కార్య కారణ ద్రవ్యాలనీ అంటారు. సృష్టిలోని ప్రతీదీ వీటితోనే ఏర్పడుతుంది. వీటిల్లో కాలం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయా కాలాలు మన శరీరం మీద, ఆరోగ్యం మీద గణనీయమైన ప్రభావాన్ని చూపి స్తాయి. అందుకే ఆయా కాలాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆయుర్వేదం నిర్దిష్టంగా చెబుతుంది. మనకు సంవత్సరంలో పన్నెండు మాసాలు, రెండు ఆయనాలు, ఆరు రుతువులు. ఉత్తరాయణంలో శిశిర, వసంత, గ్రీష్మ రుతువులు.. దక్షిణాయనంలో వర్ష, శరద్, హేమంత రుతువులు వస్తాయి. మనిషి శరీర బలాన్ని బట్టి ఆయుర్వేదం వీటిని ఆదాన, విసర్గ కాలాలుగానూ విభజిస్తుంది. ఉత్తరాయణాన్ని ఆదాన కాలంగా, దక్షిణాయనాన్ని విసర్గ కాలంగా పేర్కొంటుంది. విసర్గ కాలంలో సూర్యుడు తన శక్తిని భూమ్మీది సమస్త ప్రాణికోటికి అందిస్తాడు. అదే ఆదాన కాలంలో బలాన్ని వెనక్కి గ్రహిస్తుంటాడు. ఆదాన కాలంలో వచ్చే గ్రీష్మ రుతువులో వేడి పెరగటం వల్ల ఒంట్లో జల భూతం తగ్గుతుంది. ఫలితంగా నీరసం, దాహం పెరుగుతాయి. ఎండా కాలంలో ఒంట్లో శ్లేష్మం (కఫం) కరిగిపోయి జఠరాగ్నిని చల్లారుస్తుంది. దీంతో అగ్నిమాంద్యం తలెత్తి ఆకలి తగ్గటం, తిన్నది సరిగా జీర్ణం కాకపోవటం వంటివి మొదలవుతాయి. అన్ని వ్యాధులకూ మూలం అగ్నిమాంద్యమేనని ఆయుర్వేదం చెబుతుండటం గమనార్హం.



### తిండి సరిగా..

ఆహారం రుచిగా, శుచిగా ఉంటేనే ధాతువులకు బలం చేకూరుతుంది. కాబట్టి ఆహారం మీద శ్రద్ధ అవసరం. ఎండా కాలంలో పదార్థాలు త్వరగా చెడిపోతాయి కాబట్టి ఎక్కువసేపు బయట నిల్వ ఉంచివని తినొద్దు. అప్పుడే వండిన ఆహారం తినాలి. ఈ కాలంలో అగ్నిమాంద్యం వచ్చే అవకాశముంది కాబట్టి తేలికగా జీర్ణమయ్యే, నోటికి హితవుగా ఉండే ఆహారం తీసుకోవాలి. మితంగా నెయ్యి, నూనె వంటి స్నిగ్ధ పదార్థాలూ అవసరమే. వేసవిలో మధుర (తీపి) రసం మేలు చేస్తుంది. ఇది ఒంటికి బలాన్ని చేకూరుస్తుంది. కూరల విషయంలో దోసకాయ, పొట్లకాయ, బీరకాయ, సొరకాయ వంటి నీటితో కూడిన కూరగాయలు మేలు. బచ్చలి, పొన్నగంటి వంటి ఆకుకూరలూ శ్రేష్ఠమే. ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి, నారింజ పండ్లు నీటితో పాటు పోషకాలనూ అందిస్తాయి. మితంగా మామిడి పండ్లు, పుచ్చకాయ కూడా తినొచ్చు. పెరుగుతో భోజనం చేయకపోతే అసలు తిన్నట్టే అనిపించదు. అయితే వేసవిలో పుల్లటి పెరుగు తినొద్దు. ఇది పిత్తం ప్రకోపించేలా చేస్తుంది. తీయటి పెరుగు తినాలి. వేసవిలో చాలామంది ఐస్‌క్రీములు తింటుంటారు. ఇలాంటి చల్లటి పదార్థాలు హాయిని కలిగిస్తుండొచ్చు గానీ మరీ చల్లటివి తినొద్దు. అతి శీతల పదార్థాలు జీర్ణశక్తిని తగ్గిస్తాయి.

### పానీయ శక్తి

వేసవిలో చెమట రూపంలో ఒంట్లోంచి నీరు, లవణాలు ఎక్కువగా బయటకు వెళ్లిపోతాయి. అందువల్ల ఎప్పటికప్పుడు నీటిని భర్తీ చేసుకోవాలి. అయితే మరీ చల్లగా ఉండే నీటి కన్నా గది ఉష్ణోగ్రతలో లేదా కాస్త చల్లగా ఉండే కుండలో నీరు తాగటం మంచిది. కొన్నిరకాల పానీయాలూ ఉపయోగపడతాయి.

షడంగ పానీయం: ఇది ఔషధ పానీయం. సాధారణంగా దీన్ని జ్వరం వచ్చినవారికి సూచిస్తారు గానీ ఎండాకాలంలోనూ మేలు చేస్తుంది. తుంగ ముస్తెలు, పర్పాటకం, వట్టివేళ్లు, చందనం, సుగంధిపాల, శొంఠిని రాత్రిపూట నీటిలో నానబెట్టి.. మర్నాడు ఉదయం వేడి చేసి వడగట్టుకోవాలి. దీన్ని అప్పుడప్పుడూ కొద్దికొద్దిగా తాగాలి. ఇప్పుడు షడంగ పానీయం చూర్ణాన్ని కూడా అమ్ముతున్నారు. తీసుకున్న చూర్ణానికి 14 రెట్లు నీళ్లు కలిపి.. సగం మిగిలే వరకు కాచుకోవాలి. చల్లబడిన తర్వాత కొద్దికొద్దిగా తాగాలి. రసాలా: పెరుగులో చక్కెర, కాస్త యాలకుల పొడి కలిపి తీసుకోవటం మంచిది. ఇది ఒంటికి చలువనిస్తుంది. రాగ: దానిమ్మ పండ్ల రసంలో పెరుగు మీదుండే తేట లేదా చిక్కటి పాలు, చక్కెర కలిపి కొద్దికొద్దిగా తాగుతుంటే శరీర తాపం తగ్గుతుంది.

ఖాండవ: దానిమ్మరసంలో బాగా వండిన మాంసరసాన్ని (సూప్) కూడా కలిపి చేస్తే ఖాండవ పానీయం తయార వుతుంది. ఇందులో బెల్లం, కొద్దిగా మిరియాలు, యాలకులు, లవంగ, దాల్చిన చెక్క పొడులు కూడా వేసి.. చల్లగా చేసుకొని సాయంత్రం వేళల్లో తాగొచ్చు. మాంసరసం ఉండటం వల్ల శరీరానికి తగినంత పోషణ కూడా లభిస్తుంది. పుల్లటి దానిమ్మ మూలంగా నోటి హితవు కలుగుతుంది, జీర్ణక్రియ పెరుగుతుంది.



మజ్జిగ: పల్చటి మజ్జిగలో నిమ్మరసం పిండుకొని.. కొద్దిగా మిరియాల పొడి, సైంధవ లవణం కలిపి ఉదయం, సాయంత్రం ఒకో గ్లాసు తాగితే చెమట ద్వారా పోయిన నీరు, లవణాలు భర్తీ అవుతాయి. వడదెబ్బ తగలకుండా కాపాడుకోవచ్చు.

నిమ్మరసం: నీటిలో నిమ్మరసం కలిపి తాగినా మంచిదే. ఇందులో కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపితే ఇంకా మంచిది. వీలుంటే జిలకర, యాలకుల పొడులూ వేసుకోవచ్చు.

మామిడి పానీయం: మామిడి కాయను ఉడికించి, గుజ్జును తీయాలి. దీనికి తగినంత చక్కెర కలిపి ఉడికించి, పాకం చేసుకోవాలి. ఇందులో కొద్దిగా సైంధవ లవణం, యాలకుల పొడి కలిపి.. నిల్వ చేసుకోవాలి. అవసరమైనప్పుడు కొద్దిగా తీసుకొని, నీటిలో కలిపి పానీయంగా తాగితే మేలు చేస్తుంది.

పానకం: శ్రీరామనవమికి బెల్లంతో చేసే పానకం అందరికీ తెలిసిందే. ఇది దప్పికను బాగా తీరుస్తుంది. చలువ చేస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది.

ధనియాల నీరు: ముందురోజు రాత్రి ధనియాలను నీటిలో నానేసి, మర్నాడు ఉదయం తాగితే ఒంట్లో వేడి తగ్గుతుంది.

విహారంలో జాగ్రత్త

ఎండలోకి ఎక్కువగా వెళ్లకూడదు. ఒకవేళ వెళ్తే శరీరానికి ఎండ నేరుగా తగలకుండా చూసుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి. తలకు రుమాలు చుట్టుకోవాలి. అలాగే లేత రంగు దుస్తులు ధరించాలి. ఉదయం శరీరానికి నువ్వుల నూనె రాసుకొని, తర్వాత స్నానం చేస్తే చల్లదనం లభిస్తుంది. స్నానం చేసిన తర్వాత అరగదీసిన గంధాన్ని పూసుకోవాలి. నుదురు, పొట్ట, ఛాతీ మీద చందనం రాసుకుంటే శరీరంలోంచి ఉష్ణం త్వరగా బయటకు వెళ్లిపోతుంది. రాత్రి పడుకునే ముందు మాడుకు, పాదాలకు నువ్వుల నూనె రాసుకుంటే మంచి ఉపశమనం కలుగుతుంది. నిద్ర బాగా పడుతుంది. కారులో ప్రయాణించేవారు తుంగ ముస్తల పొడిని ఫిల్టర్ కాగితంలో చుట్టి లోపల పెట్టుకోవచ్చు. ఇది గాలిని సుగంధమయం చేయటమే కాకుండా ఎండదెబ్బ తగలకుండానూ కాపాడుతుంది. ముస్తల పొడికి చందనాన్నీ కలిపితే దోమలు దరిజేరకుండా చూసుకోవచ్చు.

### సమస్యలు- చిట్కాలు, ఔషధాలు

ఎండాకాలంలో కొన్ని జబ్బులు ప్రత్యేకించి కనిపిస్తుంటాయి. కొన్ని చిట్కాలు, ఔషధాలతో వీటిని తగ్గించుకోవచ్చు.

తలనొప్పి: నుదుటికి గంధం పూతను రాసుకుంటే తలనొప్పి తగ్గుతుంది. చిన్న గుడ్డలో రెండు మూడు చుక్కల జీవనధార తైలాన్ని వేసి వాసన చూసినా మేలే.

అతిసార (విరేచనాలు): దీన్ని అసలే నిర్లక్ష్యం చేయొద్దు. ఎండాకాలంలో మామూలుగానే ఒంట్లో నీరు తగ్గుతుంది. విరేచనాలతో మరింత ఎక్కువగా తగ్గుతుంది. కాబట్టి సత్వర చికిత్స అవసరం. దీనికి గంగాధర చూర్ణం.. కుటజ ఘనవటి, కర్పూర రస మాత్రలు.. బిల్వ అవలేహ్యం, కుటజ అవలేహ్యం ఔషధాలు ఉపయోగపడతాయి.

వడదెబ్బ: మజ్జిగలో ఉల్లిపాయ కలిపి తీసుకుంటే ఎండ దెబ్బ తగలకుండా చూసుకోవచ్చు. చద్దన్నమూ మేలు చేస్తుంది. అయితే రాత్రి అన్నంలో నీరు పోసి పొద్దున లేచి తినటం కాదు. రాత్రిపూట తాజా అన్నంలోనే పాలు పోసి, కొద్దిగా పెరుగు వేసి తోడు పెట్టాలి. అలాగే మిరపకాయ, ఉల్లిపాయ వేసి మూత పెట్టాలి. మర్నాడు ఉదయం ఉప్పు కలిపి తినాలి. ఇది వడదెబ్బ తగలకుండానే కాదు, మానసిక స్థితి అస్తవ్యస్తం కాకుండానూ కాపాడుతుంది.

గులాబీ రెక్కలు, ప్రవాళ భస్మం కలిపి చేసిన గుల్కండ్ విత్ ప్రవాళ కూడా మంచిదే. దీన్ని రోజూ ఉదయం, సాయంత్రం ఒక చెంచా చొప్పున తీసుకుంటే వడదెబ్బతో పాటు చర్మం నలుపెక్కటాన్నీ నివారించుకోవచ్చు.

చర్మ సమస్యలు: ఎండ తగిలిన చోట చర్మం నల్లబడటం చూస్తూనే ఉంటాం. ఇలాంటివారు సాయంత్రం వేళ చెంచాడు పులిసిన పెరుగులో కాస్త పసుపు, చందనం, నిమ్మరసం కలిపి.. ముఖం, చేతులు, మెడ, పాదాలకు రాసుకోవాలి. అరగంట తర్వాత స్నానం చేస్తే నలుపు తగ్గే అవకాశముంది. కొబ్బరినూనెలో గంధాన్ని కలిసి చర్మానికి రాసుకుంటే చెమట కాయల వంటి సమస్యలు తగ్గటానికి తోడ్పడుతుంది.

కామలా (కామెర్లు): ఇది వచ్చినప్పుడు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. వేపుళ్లు, నూనె పదార్థాలు తగ్గించాలి. మిరియాలు వాడొద్దు. దీనికి కటుక రోహిణి, గుంట గలకర ఉపయోగపడతాయి. అలాగే నేల ఉసిరి మొక్కను దంచి చిన్న ఉండగా చేసుకొని తీసుకుంటే కామెర్లు తగ్గుతాయి. ఆరోగ్యవర్ధిని మాత్రలూ మేలు చేస్తాయి.

కళ్లకలక: దీనికి త్రిఫల కషాయం ఉపయోగపడుతుంది. గిన్నెలో రెండు చెంచాల త్రిఫల చూర్ణం తీసుకొని.. దీనికి ఏడు రెట్లు నీరు కలపాలి. గిన్నెను పొయ్యి మీద పెట్టి సగం అయ్యేవరకు మరిగించాలి. చల్లబడ్డాక గుడ్డతో కషాయాన్ని వడగట్టి తరచూ కళ్లను కడుక్కోవాలి. సప్తామృత లోహం మాత్రలను ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఒక్కోటి వేసుకోవచ్చు. త్రిఫలా ఘృతాన్ని ఉదయం, రాత్రి ఒకో చెంచా తిన్నా మంచిదే.

విషజ్వరాలు: వేసవిలో విషజ్వరాలూ వస్తుంటాయి. జలుబు (ప్రతిశ్యాయ) తగ్గటానికి శీతోపలాది చూర్ణం, హరిద్రకాండ, లక్ష్మీవిలాస రసం ఉపయోగపడతాయి. జ్వరాలకైతే సుదర్శన చూర్ణం, సుదర్శన ఘనవటి, ఆయుష్ 64, కాలమేఘ వంటి ఔషధాలు మేలు చేస్తాయి.

అన్ని రుతువులకూ కరక్కాయ

ఆరోగ్య సంరక్షణకు కరక్కాయ (హరితకి) చూర్ణం ఎంతో మేలు చేస్తుంది. దీన్ని ఆయా రుతువుల్లో ఆయా అనుపానాలతో తీసుకోవాల్సి ఉంటుంది. శిశిరంలో పిప్పలి, వసంతంలో తేనె, గ్రీష్మంలో బెల్లం, వర్షంలో సైంధవ లవణం, శరద్‌లో చక్కెర, హేమంతంలో శొంఠితో కలిపి తీసుకోవాలి. కరక్కాయ చూర్ణానికి రెండింతల అనుపానాలను కలిపి రోజుకు ఒక్కసారే సాయంత్రం వేళ తీసుకోవాలి. ఇది ఆయా రుతువుల్లో దోషాలు వికృతం కాకుండా కాపాడుతుంది. జబ్బుల బారిన పడకుండా రక్షిస్తుంది. జబ్బులు వచ్చినా తర్వగా కోలుకునేలా చూస్తుంది. అయితే సంతానం కోసం ప్రయత్నిస్తున్న దంపతులు మాత్రం దీన్ని వాడకూడదు.

# మరగకాగిన నూనెలో వేపుళ్లా... వద్దంటే వద్దు!

మరగకాగిన నూనెలో ముంచి తీసే వేపుడు వంటకాలు ఆరోగ్యానికి అస్సలు మంచివి కావని వైద్యపరిశోధనా రంగం హెచ్చరిస్తోంది. ఎందుకిలా? ఏమిటి వీటితో నష్టం?వివరాలు మీ కోసం! పళ్లెంలో వేపుడు ముక్కలు చూస్తూనే నోట్లో నీళ్లూరిపోతుంటాయి. కమ్మగా కరకరలాడుతూ.. కాస్త కారంకారంగా ఉండే వేపుడు కూర వడ్డిస్తానంటే వద్దనే వాళ్లు ఎవరు? ఈ వేపుళ్లను వేగంగా వండెయ్యొచ్చు. పెద్ద ఖర్చూ అవ్వదు. పైగా అంతా ఇష్టంగా తింటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా హొటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఈ వేపుడు వంటకాలదే తొలి దర్శనం! అలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్.. ఫ్రైడ్ ఫిష్.. చికెన్ స్ట్రిప్స్.. చీజ్ స్టిక్స్.. రుచి విషయంలో వీటి గురించి మరో ఆలోచనేం అక్కర్లేదు. కానీ మరగకాగిన నూనెలో ముంచి తీసే వేపుళ్లతో చాలా నష్టం ఉంది.

### క్యాలరీల తంటా

వేపుడు కూరల నుంచి వచ్చే క్యాలరీలు చాలా ఎక్కువ. ఎందుకంటే ముక్కలను వేడివేడి నూనెలో ముంచి తీసినప్పుడు వాటిలో ఉండే నీరంతా ఆవిరైపోతుంది, ఇదే సమయంలో అవి నూనెను బాగా పీల్చుకుంటాయి. నూనె వంటి కొవ్వుల నుంచి మనకు అందే శక్తి (అంటే క్యాలరీలు) చాలా చాలా ఎక్కువ. అందుకే ఉడికించటం, నిప్పుల మీద కాల్చటం వంటి ఇతరత్రా పద్ధతుల్లో వండిన వాటికంటే నూనె వేపుళ్ల నుంచి మనకు చాలా ఎక్కువ క్యాలరీల శక్తి అందుతుంది. చిన్న ఉదాహరణ చూద్దాం. 100 గ్రాముల బంగాళదుంప ముక్కలను ఉడికించామనుకోండి. దాన్నుంచి మనకు దాదాపు 93 క్యాలరీల శక్తి అందుతుంది, కొవ్వు పెద్దగా ఉండదు. అదే ఆలూ ముక్కలను వేడివేడి నూనెలో వేసి బాగా కరకరలాడేలా వేయించామనుకోండి (డీప్ ఫ్రై). వాటి నుంచి దాదాపుగా 17 గ్రాముల కొవ్వు, 319 క్యాలరీల శక్తి అందుతాయి. అలాగే 100 గ్రాముల చేప ముక్కలను ఉడికిస్తే వాటి నుంచి 105 క్యాలరీల శక్తి, 1 గ్రాము కొవ్వు మాత్రమే అందుతాయి. అదే చేప ముక్కలను నూనెలో వేయిస్తే 232 క్యాలరీల శక్తి, 12 గ్రాముల వరకూ కొవ్వు అందుతాయి. కాబట్టి మనం వండే పద్ధతి వల్ల కొవ్వు, క్యాలరీలు పెరిగిపోతాయని, తరచూ వేపుళ్లను తింటుంటే దీనివల్ల ఊబకాయం, మధుమేహం వంటి చాలా రకాల సమస్యలు పొంచి ఉంటాయని గుర్తించాలి.

### జబ్బులూ రుచి చూడాల్సి రావచ్చు!

గుండె జబ్బులు: వేపుడు పదార్థాలు ఎంత తరచుగా తింటుంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా పెరుగుతోందని ఇటీవలి కాలంలో జరిగిన రెండు అతి పెద్ద అధ్యయనాల్లో గుర్తించారు.



తరచూ వేపుళ్లు తింటున్న వారిలో హైబీపీ సమస్య ఎక్కువగా ఉంటోంది, మరోవైపు మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) స్థాయిలు ఉండాల్సినంత ఉండటం లేదు. ఈ రెండూ గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.

మధుమేహం:వేపుడు పదార్థాలను వారానికి ఒకసారి తింటున్న వారితో పోలిస్తే- వారానికి 4-6 సార్లు తింటున్న వారిలో మధుమేహం వచ్చే ముప్పు 39% అధికంగా ఉంటోంది. వేపుడు పదార్థాల్లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల వల్ల బరువు పెరగటంతో పాటు ఆకలిని నియంత్రించే హార్మోన్లు కూడా అస్తవ్యస్తమైపోతున్నాయని, ఇది మధుమేహం, ఊబకాయాలకు దారి తీస్తోందని గుర్తించారు.

క్యాన్సర్లు: వండేప్పుడు ఆహారపదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతల వద్దకు తీసుకువెళుతున్నప్పుడు దానిలో 'అక్రిలమైడ్' అనే విషతుల్యం తయారవుతుంది. పొగలొస్తున్న నూనెల్లో వేయించటం, కణకణ మండే నిప్పుల మీద కాల్చటం, మాడ్చటం వంటివన్నీ ఈ రకమైన రసాయనిక చర్యకు ఆస్కారం ఇస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆలుగడ్డల వంటి వాటిలో ఉండే పిండిపదార్థాలు, చక్కెరలు, ఆస్పరాజిన్ అనే అమైనో ఆమ్లం- ఇలాంటి వాటన్నింటి మధ్యా రసాయన చర్యలు జరిగి 'అక్రిలమైడ్' తయారవుతోంది. ఇది చాలా రకాల క్యాన్సర్లకు కారణమవుతోందని జంతువులపై జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది. దీని ప్రభావం మనుషుల మీద ఎలా ఉంటోందన్న దిశగా ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. వేపుళ్ల వల్ల క్యాన్సర్ రాదని మాత్రం ఇంత వరకూ ఎవరూ నిర్ధారించలేదు.

### ట్రాన్స్ ఫ్యాట్స్ తిప్పలు

వంట నూనెలను మరగకాచినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద దానిలో రసాయనిక స్వభావం మారిపోయి అవి 'ట్రాన్స్ ఫ్యాట్స్' రకం కొవ్వులుగా మారిపోతాయి. ఈ తరహా కొవ్వులను మన శరీరం తేలికగా అరిగించుకోలేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి చాలా రకాల ఆరోగ్య సమస్యలు బయల్దేరతాయి. బయట ప్యాకెట్లలో దొరికే వేపుడు పదార్థాలతో కూడా ఈ రకం సమస్య తప్పదు. పైగా ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు తయారీదారులు వాటిని అధిక పీడనంతో హైడ్రోజెన్ వాయువును ఉపయోగించి ప్రత్యేక పద్ధతిలో వండుతారు. దీన్నే 'హైడ్రోజినేషన్' అంటారు. దీనివల్ల కూడా ఆయా వేపుడు పదార్థాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల స్థాయి పెరిగిపోతుంది. మరో పెద్ద సమస్య ఏమంటే- వంట నూనెలను మన ఇళ్లలోనూ, హొటళ్లలో కూడా ఒక్కసారే వాడరు. అవసరమైనప్పుడల్లా మరగకాచి వండుతుంటారు, మళ్లీ భద్రపరుస్తుంటారు. ఇలా ఒకసారి కాచిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేస్తుండటం వల్ల వాటిలోని ప్రమాదకర ట్రాన్స్ ఫ్యాట్స్ స్థాయిలు మరింతగా పెరిగిపోతున్నాయని పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు. వేపుళ్లు వండాలంటే నూనెను విపరీతంగా కాచక తప్పదు, ఆ నూనెతో ఈ తరహా అనారోగ్యకరమైన ముప్పులూ తప్పవు.

### మనమేం చెయ్యాలి

వేపుడు పదార్థాలను మరీ తరచుగా తినకుండా ఉండటం అత్యుత్తమం. ఎప్పుడన్నా ఒకసారి తింటే ముప్పు మరీ అంత ఎక్కువగా ఉండదు.

పని తేలిక అవుతుందని, వంటకాలు రుచిగానూ ఉంటాయని ప్రతి కూరనీ నూనెలో పోసి వేయించెయ్యకుండా... ఇతరత్రా వంట పద్ధతులపైనా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇగురు కూరలు, ఉడికించిన వంటకాలను కూడా రుచికరంగా చేసుకునే పద్ధతులు తెలుసుకోవాలి. మరీ ఎప్పుడన్నా కావాలనుకుంటే వేపుళ్లను ఓవెన్‌లోనో, ఎయిర్ ఫ్రైయర్ల వంటి వాటిలోనో చేసుకుంటే- నూనెలో ముంచి తియ్యాల్సిన పని లేకుండానే ముక్కలు కరకరలాడతాయి!